ఐరాసలో పాకిస్థాన్‌పై
## భారత్ నిప్పులు
- అఫ్గానిస్థాన్‌పై వైమానిక దాడులు
- నరమేధం అంటూ ధ్వజం
- స్వతంత్ర దర్యాప్తునకు డిమాండ్
- రాయబారి హరీష్ పర్వతనేని 2లో..

www.citytimesnews.com

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

మమతా కార్యాలయానికి
## సీఐడీ టీమ్
- సంతకాల ఫోర్జరీ కేసు
- తృణమూల్ కాంగ్రెస్‌కు మరిన్ని చిక్కులు
- మమతా నివాసానికి ఆనుకుని కార్యాలయం 2లో..

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 26 | సంచిక - 181 | హైదరాబాద్ | బుధవారం | తేదీ:10.06.2026 | పేజీలు 10 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

జోజిలా టన్నెల్
## బ్రేక్‌థ్రూ విజయం
- 15 నిమిషాల్లోనే కాశ్మీర్ నుంచి లద్దాఖ్
- ప్రారంభించిన కేంద్ర మంత్రి గడ్కరీ
- గతంలో గంటన్నర.. ఇప్పుడు 15 నిమిషాలు

**శ్రీనగర్, సిటీ టైమ్స్**

కాశ్మీర్ లోయను లద్దాఖ్‌తో అనుసంధానించే వ్యూహాత్మక జోజిలా టన్నెల్ ప్రాజెక్టులో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. హిమాలయ పర్వత శ్రేణులను చీల్చుకుంటూ సాగుతున్న ఈ సొరంగ మార్గంలో చివరి 2.5 మీటర్ల భాగాన్ని విజయవంతంగా పేల్చివేయడంతో ప్రధాన సొరంగం రెండు అంచులు ఒకదానితో ఒకటి కలిసిపోయాయి. నిర్దేశిత గడువు కంటే 6 నెలల ముందే ఈ అద్భుత మైలురాయిని (బ్రేక్‌థ్రూ) అధిగమించడం విశేషం.

8లో..

హైదరాబాద్‌ను
## ముంచెత్తిన భారీ వర్షం



- భారీగా ట్రాఫిక్ జామ్
- రోడ్లన్నీ జలమయం
- విస్తరిస్తున్న రుతుపవనాలు
- ఇవాళ, రేపు భారీ వర్షా లు..!
- ఉరుములు, మెరుపులతో వానలు
- జిల్లాలకు ఎల్లో అలర్ట్

2లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

భాగ్యనగరంలో మంగళవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరాన్ని ముంచెత్తుతూ కురిసిన భారీ వర్షం కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. ఆఫీసుల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే పీక్ అవర్స్‌లో ఈ వర్షం పడటంతో నగర జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రోడ్లపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**స్తంభించిన ఐటీ కారిడార్..**

నగరంలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన జంక్షన్లలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ముఖ్యంగా హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఖైరతాబాద్‌తో పాటు సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్, మారేడ్‌పల్లి వంటి ప్రాంతాల్లో వాహనదారులు ఇళ్లకు చేరుకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.



తెలంగాణ ప్రగతి
# మహిళల చేతుల్లోనే..

- మహిళా శక్తి వారోత్సవాల ముగింపు
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు
- పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు
- ఉచిత బస్సు పథకంపై విమర్శలకు సీఎం కౌంటర్
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- మహిళలతో పెట్టుకుంటే..

ఎవరైనా అధికారంలో ఉంటారా?: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

ఆడబిడ్డలను లక్ష్మీదేవిగా కొలిచే సంస్కృతి మనదని, భూమిని భూమాతగా, దేశాన్ని భారత మాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావించి గౌరవించుకునే గొప్ప సాంప్రదాయం మనదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి వారోత్సవాల' ముగింపు సభలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి వీరనారీమణులు తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు. దేశంలో మహిళలకు ఓటు హక్కు కల్పించి, వారి చేతికి అధికారం ఇచ్చిన ఘనత జవహర్‌లాల్ నెహ్రూదేనని, కాంగ్రెస్ పార్టీయే మహిళలకు రాష్ట్రపతిగా, కేంద్ర మంత్రులుగా అవకాశాలు కల్పించిందని స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 2013లోనే సోనియా గాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారని, రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మహిళలు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని తెలిపారు. ఇదే సమయంలో విపక్షాలపై విమర్శలు గుప్పించారు.

2లో..

## ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ 100 కోట్ల అవినీతి చిట్టా



- 3 కిలోల గోల్డ్ సీజ్
- 11 ప్రాంతాల్లో 16 బృందాలు
- మద్యం సీసాలు లభించినట్లు ఏసీబీ వెల్లడి
- రూ.60 లక్షల నగదు దొరికింది

3లో..

**మాదాపూర్, సిటీ టైమ్స్**

హైదరాబాద్ మాదాపూర్‌లోని రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇళ్లు, ఆఫీసుల్లో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో.. మోహన్ నాయక్ ఇంట్లో సోదాలు నిర్వహించారు.

14 రకాల సరుకులు
## ఇవ్వాల్సిందే
- రేషన్ దుకాణాల్లో అన్నీ ఇవ్వాలి
- ఐద్వా నాయకుల డిమాండ్
- నిత్యావసర ధరలు తగ్గించాలి
- పేద, మధ్యతరగతిని ఆదుకోవాలి

2లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు.

గచ్చిబౌలి బంగారం,
## వజ్రాల చోరీ కేసు
- రూ.6 కోట్ల సొత్తుదోచుకున్న నేపాలీ జంట
- గంటల్లో ఛేదించిన పోలీసులు
- యూపీలో ఉన్నట్లు తెలిసి అదుపులోకి




2లో..



విజయన్ కూతురికి
## ఈడీ సమన్లు
- మనీ లాండరింగ్ కేసు
- 12న విచారణకు రావాలని ఆదేశం

4లో..

గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో
## చేసిందేమీ లేదు
- అశ్వారావుపేటలో అభివృద్ధి పనుల ప్రారంభం
- 25 లక్షల రైతులకు రుణమాఫీ: మంత్రి పొంగులేటి
- 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

4లో..



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.

జీతాలు ఇవ్వకుండా
## వేధింపులు
- రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్
- అంగన్‌వాడీల ఉసురు తగులుతుంది

4లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.

## బతుకులు మారలేదు
- తెలంగాణ వచ్చినా అవే ప్రజల బతుకులు
- ప్రత్యేక రాష్ట్రం సాధించినా ఫలితం లేదు
- దోచుకునేవాళ్లే పాలకులు

2లో..



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు.



# మమతా కార్యాలయానికి సీఐడీ టీమ్

**కోల్‌కతా, సిటీ టైమ్స్**

ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీకి సంబంధించిన కేసులో తృణమూల్ కాంగ్రెస్ కు మరిన్ని చిక్కులు తప్పేలా లేవు. ఈ కేసు విచారణలో భాగంగా ఖాళీఘాట్‌లోని టీఎంసీ కార్యాలయానికి సీఐడీ బృందం మంగళవారంనాడు వెళ్లింది. అయితే సీఐడీ టీమ్‌ను కార్యాలయం ఆవరణలోకి అనుమతించలేదని తెలుస్తోంది. టీఎంసీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నివాసానికి ఆనుకుని ఈ కార్యాలయం ఉంది. తొలుత ఖాళీఘాట్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని వెంట తీసుకుని సీఐడీ బృందం టీఎంసీ కార్యాలయానికి వెళ్లింది. కార్యాలయం వద్ద వేచిచూస్తుండగా వారిని కలిసేందుకు టీఎంసీ మాజీ ఎంపీ, పార్టీ కోశాధికారి సుభాశిష్ చక్రవర్తి బయటకు వచ్చారు. మమతా బెనర్జీ , టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీలు ఇండియా కూటమి సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీలో ఉన్నారని సీఐడీ బృందానికి చక్రవరి తెలియజేశారు. వారు లేకుండా లోపలకు అనుమతించలేమని చెప్పారు. అయితే విచారణలో భాగంగానే తాము వచ్చామనీ, సంబంధితులు ఎవరూ ఉండాల్సిన పని లేదని సీఐడీ అధికారుల తెలిపారు. అభిషేక్‌కు ఇచ్చిన నోటీసును చూపిస్తూ, సెర్చ్ ఆపరేషన్‌కు సహకరించాలని కోరారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలుస్తోంది. కామాక్ స్ట్రీట్‌లోని అభిషేక్ బెనర్జీ నివాసానికి కూడా ఒక సీఐడీ టీమ్ వెళ్లిందని సమాచారం. నకిలీ సంతకాల కేసులో పోలీస్ ఇన్వెస్టిగేషన్‌ను సహకరిస్తున్న సీఐడీ టీమ్ గత మే 30న తొలిసారి అభిషేక్ ఖాళీఘాట్ నివాసానికి వెళ్లింది. జూన్ 1న విచారణకు హాజరుకావాలని కోరింది. అయితే తనకు 14 రోజులు గడువు ఇవ్వాలని అభిషేక్ కోరారు. ఆయన చేసిన విజ్ఞప్తిని సీఐడీ తోసిపుచ్చింది. వారం రోజుల్లోగా తమ ముందు హాజరుకావాలని తాజా నోటీసు ఇచ్చింది. అయితే సోమవారంతో ఆ గడువు ముగిసినప్పటికీ సీఐడీ విచారణకు అభిషేక్ హాజరుకాలేదు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా శోవన్‌దేబ్ ఛటోపాధ్యాయ, ప్రతిపక్ష ఉపనాయకులుగా అసిమా పాత్రా, నైనా బంద్యోపాధ్యాయ, చీఫ్ విప్‌గా ఫిర్హాద్ హకీంల నియామకానికి సంబంధించి అసెంబ్లీకి సమర్పించిన పత్రాలపై పలువురు టీఎంసీ ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది.

# బతుకులు మారలేదు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## 14 రకాల సరుకులు

# ఇవ్వాల్సిందే

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లు లక్ష్మి మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, పాఠశాల ఫీజులు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల కారణంగా కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1 కోటి 5 లక్షల 42 వేల 188 బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయని, వాటి పరిధిలో 3 కోట్ల 39 లక్షల 96 వేల 239 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి ఆరు కిలోల బియ్యం మాత్రమే అందిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజల ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే బియ్యంతో పాటు పప్పులు, వంటనూనెలు, మొక్కజొన్నలు, చక్కెర, కారం, పసుపు, జీలకర్ర, పామాయిల్, కొబ్బరి నూనె, ఆవాలు, జొన్నలు, పల్లీలు, సబ్బులు వంటి మొత్తం 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల అనేక కుటుంబాలు పోషకాహారాన్ని తీసుకోలేకపోతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికమవుతోందని మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పోషకాహారం అందక చిన్నారులు కూడా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆశలత, కె. నాగలక్ష్మి, పి. శశికళ, వై. వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బట్టుపల్లి అనూరాధతో పాటు లక్ష్మమ్మ, సృజన, నవీన, షాబానా బేగం, మస్తాన్ బీ, ఎం. అరుణ, సంధ్య, ఇందిర, వెంకటమ్మ, కవిత, భవాని తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.



# ఐరాసలో పాకిస్థాన్‌పై భారత్ నిప్పులు

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా పాకిస్థాన్ ద్వంద్వ విధానాలను, ఉగ్రవాద చర్యలను భారతదేశం తీవ్రస్థాయిలో ఎండగట్టింది. అఫ్గానిస్థాన్ భూభాగంపై పాక్ సైన్యం జరిపిన వైమానిక దాడులను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా అభివర్ణించడమే కాకుండా అది ముమ్మాటికీ సామాన్య పౌరులపై జరిగిన 'నరమేధమే' అని భారత్ మండిపడింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి హరీష్ పర్వతనేని ఈ సమావేశంలో మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో కూడా పాక్ జరిపిన దాడుల్లో మహిళలు, చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోవడాన్ని తీవ్రంగా ఖండించారు.

**మిలిటరీ ఆపరేషన్ పేరు పెట్టి ప్రాణాలు తీస్తున్నారు..!**

"ఒక ఘోర నరమేధానికి మిలిటరీ ఆపరేషన్ అని పేరు పెట్టినంత మాత్రాన చేసిన పాపం కొట్టుకుపోదు" అని రాయబారి హరీష్ పర్వతనేని పాకిస్థాన్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పౌరులను చంపడం, పిల్లలను అనాథలను చేయడం ఎప్పటికీ ఉగ్రవాద నిర్మూలన కాబోదని స్పష్టం చేశారు. ఐరాస నివేదికల ప్రకారం.. 2026 మొదటి మూడు నెలల్లోనే పాక్ దాడుల వల్ల 372 మంది అమాయక పౌరులు మరణించగా, 397 మంది గాయపడ్డారు. ఈ దారుణాలపై స్వతంత్ర దర్యాప్తు జరిపి నిందితులను శిక్షించాలని భారత్ డిమాండ్ చేసింది.




దీనికితోడు అఫ్గానిస్థాన్ వాణిజ్యాన్ని దెబ్బతీసేలా పాక్ ల్యాండ్ రూట్‌ను నిలిపివేయడాన్ని భారత్ "ట్రేడ్ అండ్ ట్రాన్సిట్ టెర్రరిజం"గా పేర్కొంది. దీనికి విరుగుడుగా అఫ్గాన్ వస్తువులకు భారత్ సుంకాలు లేని మార్కెట్ సదుపాయాన్ని, ప్రత్యేక ఎయిర్ కార్గో కారిడార్‌ను అందుబాటులోకి తెచ్చిందని.. ప్రస్తుతం అఫ్గానిస్థాన్ మొత్తం ఎగుమతుల్లో 43 శాతం భారత్‌కే జరుగుతున్నాయని ప్రపంచ బ్యాంక్ నివేదికలను ఉటంకించారు.

**అఫ్గానిస్థాన్‌కు భారత్ భారీ సాయం..**

ఒకవైపు పాక్ అరాచకాలు సృష్టిస్తుంటే.. భారత్ మాత్రం అఫ్గానిస్థాన్‌లోని మొత్తం 34 ప్రావిన్సుల్లో 500కు పైగా సంక్షేమ ప్రాజెక్టుల ద్వారా మానవతా దృక్పథంతో అండగా నిలుస్తోందని పర్వతనేని వివరించారు. ఆగస్టు 2021 నుంచి ఇప్పటి వరకు 50,000 టన్నుల గోధుమలు, 420 టన్నుల మందులు, వ్యాక్సిన్లను భారత్ సరఫరా చేసింది. కాబూల్‌లోని ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ ఆధునీకరణతో పాటు పలు ప్రాంతాల్లో మాతాశిశు క్లినిక్‌లు, క్యాన్సర్, ట్రామా కేర్ సెంటర్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా గుండె జబ్బులతో బాధ పడుతున్న అఫ్గాన్ పిల్లలకు భారత్‌లో ఉచిత వైద్యం అందిస్తున్నామని, క్రీడా దౌత్యంలో భాగంగా అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టుకు ద్వైపాక్షిక సిరీస్ కోసం ఆతిథ్యం ఇస్తున్నామని ప్రకటించారు.

అంతేకాకుండా పాకిస్థాన్ అంతర్గత రాజకీయ, ఆర్థిక వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి 'ఫిత్నా అల్ హిందుస్థాన్' వంటి తప్పుడు ప్రచారాలతో దేశంలో "ద్వేషపూరిత ఫ్యాక్టరీ"ని నడుపుతోందని భారత్ ఆరోపించింది. పాక్ తెచ్చిన 27వ రాజ్యాంగ సవరణ ఆ దేశంలో పరోక్ష సైనిక పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేస్తూ.. అంతర్జాతీయ సమాజం అఫ్గాన్ ప్రజలను ఒంటరి చేయకుండా వారికి అండగా నిలవాలని భారత్ పిలుపునిచ్చింది.

# గచ్చిబౌలి బంగారం, వజ్రాల చోరీ కేసు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

హైదరాబాద్ నగరంలో నేపాలీ గ్యాంగ్ హడలెత్తిస్తోంది. ధనవంతుల ఇళ్లలో పని కోసం వచ్చి.. సరైన సమయం చూసి.. ఇళ్లను దోచుకుంటున్న ఘటనలు పెరిగిపోవడం తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో నగరంలో నేపాలీ గ్యాంగ్ చోరీలు పెరిగిపోవడంతో.. పోలీసులకు పెను సవాల్‌గా మారింది. ఈ క్రమంలోనే తాజాగా గచ్చిబౌలి పరిధిలోని ఓ వ్యాపారి, తన కుటుంబంతో కలిసి వేరే సిటీకి వెళ్లి తిరిగి వచ్చేసరికి.. ఇంట్లో పనిచేసే నేపాలీ జంట.. బంగారం, వజ్రాలతో ఉడాయించిన ఘటన కలకలం రేపింది. ఆ వ్యాపారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. గంటల వ్యవధిలోనే ఆ భార్యాభర్తలను అరెస్ట్ చేయడంతో.. కథ సుఖాంతమైంది.

గచ్చిబౌలి హిల్ రిడ్జ్ విల్లాలో నివసిస్తున్న ఓ బిజినెస్‌మెన్ ఇంట్లో భారీగా బంగారు నగలు, వజ్రాలు దొంగతనానికి గురయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేశారు. ఆ వ్యాపారి ఇంట్లో పనిచేసే నేపాలీ దంపతుల కోసం తీవ్రంగా గాలించిన పోలీసులు.. అన్ని రాష్ట్రాలకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలోనే తెలంగాణ, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. యూపీలో ఆ నిందితులు ఉన్నట్లు ఆ రాష్ట్ర పోలీసులు ఇచ్చిన సమాచారంతో వారిని పట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఆ నేపాలీ జంటతోపాటు మరో వ్యక్తిని యూపీ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆ నేపాలీ జంటను ఆ వ్యాపారి ఇంటి పనులకోసం నెల రోజుల క్రితమే పనిలో పెట్టుకున్నట్లు పోలీసులకు బాధితులు వివరించారు. ఇటీవల ఆ వ్యాపారి కుటుంబం ముంబైకి వెళ్లి వచ్చారు. ఆ సమయంలో ఆ నేపాలీ జంట వారికి కనిపించలేదు. అయితే వేసిన తాళాలు వేసినట్లే ఉండటంతో వారికి మొదట ఎలాంటి అనుమానం రాలేదు. ఆ తర్వాత పూజ గదిలో ఉంచిన గోల్డ్ చైన్ కనిపించకపోవడంతో వారికి అనుమానం వచ్చింది. దీంతో ఇంట్లో ఉన్న బంగారు, వజ్రాల ఆభరణాలు ఉన్నాయో లేదో చెక్ చేశారు. ఈ క్రమంలోనే ఇంట్లో ఉన్న మరిన్ని బంగారం, వజ్రాలు కూడా మాయమైనట్లు గుర్తించారు.

దీంతో తక్షణమే గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చోరీకి సంబంధించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వారి ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి.. ఆ సొత్తును దోపిడీ చేసింది ఆ ఇంట్లో పనిచేసే నేపాలీ జంట అని తేల్చారు. పారిపోయిన ఆ నేపాలీ దంపతులను పట్టుకునేందుకు స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే వారు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్నట్లు సమాచారం అందింది. ప్రస్తుతం వారిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆ నేపాలీ జంట వద్ద దాదాపు రూ.6 కోట్ల బంగారు, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ప్రగతి మహిళల చేతుల్లోనే..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

ఆడబిడ్డలను లక్ష్మీదేవిగా కొలిచే సంస్కృతి మనదని, భూమిని భూమాతగా, దేశాన్ని భారతమాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావించి గౌరవించుకునే గొప్ప సాంప్రదాయం మనదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి వారోత్సవాల' ముగింపు సభలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి వీరనారీమణులు తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు. దేశంలో మహిళలకు ఓటు హక్కు కల్పించి, వారి చేతికి అధికారం ఇచ్చిన ఘనత జవహర్‌లాల్ నెహ్రూదేనని, కాంగ్రెస్ పార్టీయే మహిళలకు రాష్ట్రపతిగా, కేంద్ర మంత్రులుగా అవకాశాలు కల్పించిందని స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 2013లోనే సోనియా గాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారని, రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మహిళలు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని తెలిపారు. ఇదే సమయంలో విపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ.. గత ప్రభుత్వం మొదటి ఐదేళ్లు ఒక్క మహిళకు కూడా మంత్రిగా అవకాశం కల్పించలేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏనాడూ తమ పార్టీ అధ్యక్షుడిగా మహిళను నియమించలేదని ఎద్దేవా చేశారు.

గత ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన సున్నా వడ్డీ రుణాలను కూడా ఎగ్గొట్టిందని, కానీ తమ ప్రజా ప్రభుత్వం రాగానే ఆ బకాయిలను మంజూరు చేసిందని సీఎం తెలిపారు. తాము ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై కొందరు కడుపు నిండా విషం నింపుకుని, కళ్లల్లో నిప్పులు పోసుకుంటూ రద్దు చేయాలని రోడ్డెక్కారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గకుండా ఉచిత బస్సు సౌకర్యాన్ని కొనసాగిస్తున్నామని, దీనివల్ల వేలాది మంది ఆడబిడ్డలు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని చెప్పారు. వాతావరణ శాఖ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉంటుందని హెచ్చరించినప్పటికీ, తాము మహిళా సంఘాల కోసం 553 సరికొత్త బస్సులను ప్రారంభించగానే వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాడంటూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

మహిళలను కేవలం చిన్న చిన్న పనులకే పరిమితం చేయకుండా.. అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలతో పోటీ పడేలా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. అలాగే పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టుపనిని కూడా వారికే ఇచ్చామన్నారు. కార్పొరేట్ ఆఫీసులకు దీటుగా 'ఇందిరా మహిళా □□□□□ భవనాలను' నిర్మిస్తున్నామని, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఐటీ హబ్ అయిన హైటెక్ సిటీలో 106 ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈకామర్స్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయించేలా గ్లోబల్ మార్కెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

తెలంగాణ ఆర్థిక ప్రగతి ఆడబిడ్డల చేతిలోనే ఉందని విశ్వసిస్తూ, రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చడమే తమ లక్ష్యమని సీఎం పునరుద్ఘాటించారు. "ఈ వేదికగా నా ఆడబిడ్డలకు మాట ఇస్తున్నా.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పూర్తి బాధ్యత నాది" అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు వెయ్యి కాదు.. ఏకంగా 3 వేల బస్సులు కొనిచ్చి వారిని యజమానులను చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో 2034 వరకు ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఇలాగే విజయవంతంగా నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇదే తరుణంలో వ్యవసాయ రంగం గురించి ప్రస్తావిస్తూ.. రైతులు ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా, మార్కెట్ డిమాండ్‌ను బట్టి అన్ని రకాల పంటలు వేసేలా మహిళా సంఘాలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

సికింద్రాబాద్: మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళాశక్తి సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ''ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం'' అన్నారు. ''అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుంది'' అన్నారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దే. భాజపా తన పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా? బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదు.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

భాగ్యనగరంలో మంగళవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరాన్ని ముంచెత్తుతూ కురిసిన భారీ వర్షం కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. ఆఫీసుల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే పీక్ అవర్స్‌లో ఈ వర్షం పడటంతో నగర జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రోడ్లపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**స్తంభించిన ఐటీ కారిడార్..**

నగరంలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన జంక్షన్లలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ముఖ్యంగా హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఖైరతాబాద్‌తో పాటు సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్, మారేడ్‌పల్లి వంటి ప్రాంతాల్లో వాహనదారులు ఇళ్లకు చేరుకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలుచోట్ల తెరిచి ఉన్న డ్రైనేజీలు, నాలాలు ఉప్పొంగి రోడ్లపైకి ప్రవహించడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

సుదీర్ఘ వేసవి కాలం తర్వాత కురిసిన ఈ భారీ వర్షం నగరవాసులకు కాస్త ఉపశమనం కలిగించినప్పటికీ.... వాతావరణ శాఖ (IMD) కీలక విషయాన్ని వెల్లడించింది. మంగళవారం కురిసిన వర్షం నైరుతి రుతుపవనాల వల్ల వచ్చింది కాదని, ఇవి కేవలం రుతుపవన ముందస్తు (ప్రీమాన్‌సూన్) జల్లులు మాత్రమేనని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్ర రాజధానిలోకి రుతుపవనాలు అధికారికంగా ప్రవేశించడానికి ఇంకా కొన్ని రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జూన్ 8వ తేదీనే నైరుతి రుతుపవనాలు తెలంగాణ దక్షిణ సరిహద్దు జిల్లాల్లోకి ప్రవేశించినప్పటికీ.... అవి ఇంకా హైదరాబాద్‌కు చేరుకోలేదు. రాబోయే కొద్ది రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నగరంలో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ గణాంకాల ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు నగరంలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి:

బన్సీలాల్‌పేట్: 87.3 మి.మీ

విఠల్‌వాడి: 78.8 మి.మీ

జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, హిమాయత్‌నగర్: 78 మి.మీ

విద్యానగర్ (TSRTC ఎంప్లాయిస్ బిల్డింగ్): 73.5 మి.మీ

బౌద్ధనగర్, ముషీరాబాద్: 61.8 మి.మీ

తల్లాబస్తీ, ముషీరాబాద్: 60 మి.మీ

రూప్‌లాల్ బజార్, బహదూర్‌పురా: 58 మి.మీ

చందులాల్ బారాదరి: 57.8 మి.మీ

న్యూ మెట్టుగూడ ప్రైమరీ స్కూల్: 57.3 మి.మీ

ట్యాంక్‌బండ్‌తో పాటు.. సచివాలయం ముందు రహదారులపై మోకాలు లోతు మేర నీరు నిలిచిపోయింది. ఈ నీటిని హైడ్రా సిబ్బంది మళ్లించేందుకు తీవ్రంగా శ్రమించింది. ట్యాంక్‌బండ్ మీద సికింద్రాబాద్ వైపు వర్షపు నీరు నిలిచిపోవడమే కాకుండా.. చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు అక్కడ పరిస్థితిని పర్యవేక్షించారు. చెట్టును తొలగించే పనులతో పాటు.. వరద సాఫీగా సాగేలా హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది నిమగ్నమయ్యారు. క్షేత్ర స్థాయిలో డీఆర్ ఎఫ్ సేవలందిస్తున్నాయి. రహదారిపై పడిన చెట్లను తొలగిస్తున్నారు. రోడ్లపై నిలిచిపోయిన వరద నీటిని పంపించే పనిలో నిమగ్నమయ్యారు. శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, షేక్‌పేట, టోలిచౌకి, మాధాపూర్ ప్రాంతాలతో పాటు.. సికింద్రాబాద్, హైదర్‌గూడ ప్రాంతాల్లో హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్నారు. దాదాపు 76 చోట్ల చెట్లు పడిపోవడంతో వాటిని తొలగించే పనుల్లో హైడ్రా సిబ్బంది ఉన్నారు.

నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా వాతావరణం వేగంగా మారుతోంది. రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**పలు జిల్లాకు భారీ వర్ష సూచన:**

రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న రుతుపవనాల కారణంగా ఉత్తర, పశ్చిమ మరియు దక్షిణ తెలంగాణ పరిధిలోని పలు జిల్లాలపై వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం బులెటిన్ ప్రకారం.... పలు జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉంది.

## ఐఐఐటీ కారిడార్‌లో సీపీ క్షేత్రస్థాయి పర్యటన



- ఐఐఐటీ జంక్షన్–డీఎల్ఎఫ్ మార్గంలోని పనుల పురోగతిపై సమీక్ష
- మూడు నెలలు ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణకు ఆదేశాలు

సైబరాబాద్, జూన్ 9 (సిటీటైమ్స్)

గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శేరిలింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సీఎంసీ అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుంచి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పనులు నిర్ణీత గడువు లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు నిర్మాణాల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ ఒత్తిడి పెరగకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల రాకపోకల నిర్వహణపై అధికారులతో చర్చించారు. రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేసి అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు.

రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ఐఐఐటీ జంక్షన్-డీఎల్ఎఫ్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సీపీ తెలిపారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సురేష్, సీఎంసీ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## పోలీస్–మీడియా సత్సంబంధాలకు క్రికెట్ వేదిక




- 'సైబరాబాద్ ప్రెస్ అండ్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్–2026' ప్రారంభం
- ప్రారంభించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

సైబరాబాద్, జూన్ 9 (సిటీటైమ్స్)

పోలీస్–మీడియా మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న 'సైబరాబాద్ ప్రెస్ అండ్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్–2026'కు మంగళవారం శ్రీకారం చుట్టారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సీపీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో టోర్నమెంట్‌ను ప్రారంభించారు. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అదనపు డీసీపీ షమీర్ ఆధ్వర్యంలో జూన్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు పోటీలు నిర్వహించనున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులతో కూడిన జట్లు ఇందులో పాల్గొంటున్నాయి. తొలి రోజు జరిగిన మ్యాచ్‌లలో మల్కాజిగిరి మీడియా థండర్స్ జట్టు, క్రైమ్ పార్ట్నర్స్‌పై విజయం సాధించింది. వంశీ నాయకత్వంలో బరిలోకి దిగిన జట్టు పోరాటపటిమ కనబరిచింది. మెరుగైన ఆటతీరుతో జెస్తాది రాజు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచారు. మరో మ్యాచ్‌లో ప్రణవ్ నేతృత్వంలోని ఎస్‌సీఎస్‌సీ డిఫెండర్స్, ఖాదిర్ నాయకత్వంలోని శేరిలింగంపల్లి జట్టుపై గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో శివకుమార్ అత్యుత్తమ ప్రదర్శనతో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు శాఖ–మీడియా ప్రతినిధుల మధ్య పరస్పర అవగాహన, సమన్వయాన్ని పెంపొందించడంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడాస్ఫూర్తితో పాటు జట్టుగా పనిచేసే భావన, పరస్పర గౌరవాన్ని పెంచడమే ఈ లీగ్ ఉద్దేశమని తెలిపారు. 'యునైటెడ్ ఇన్ స్పిరిట్ – స్ట్రాంగర్ టుగెదర్' నినాదంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ జూన్ 11న జరగనుంది.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి

- మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి

శామీర్ పేట జూన్ 9 సిటీ టైమ్స్:

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ రవి అన్నారు. వన మహోత్సవం దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మొక్కల నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మోర్సు భాయి శశిరేఖ, కౌన్సిలర్స్ పెద్ది రెడ్డి శ్రీలత, రాజీగాళ్ల లత, గొంది శ్రీవాణి, మూడవత్ నవీన్, ముద్దం పాపి రెడ్డి, మెర్పటి గోవర్ధన్ రెడ్డి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ స్థానిక నాయకులు శ్రీనివాస్ గౌడ్ శ్రీకాంత్ రెడ్డి మంద స్వామి బసవ రెడ్డి నర్సింహులు మున్సిపల్ అధికారులు డి ఈ స్ఫూర్తి, మేనేజర్ ఉషా, మోహన్ సింగ్, మల్లిఖార్జున్ బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే హైదరాబాద్ గ్లోబల్ సిటీగా అభివృద్ధి



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

బాచుపల్లి, జూన్ 9(సిటీ టైమ్స్):

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడం, ఆధునిక మౌలిక వసతుల కల్పన చేయడం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. మంగళవారం నిజాంపేట సర్కిల్ పరిధిలోని బాచుపల్లి ఫ్లైఓవర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ వంటి అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని పేర్కొన్నారు. బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందని, రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నిజాంపేట సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, ఆగం రాజు, చందు ముదిరాజ్, రవికిరణ్, బాలాజీ నాయక్, సుజాత, మాజీ ఉపసర్పంచ్ సలీం, పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు సతీష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆనంద్ రెడ్డి, 32వ డివిజన్ అధ్యక్షురాలు స్వర్ణకుమారి, ఎన్ఎంసీ మహిళా అధ్యక్షురాలు అర్పిత, మాజీ వార్డ్ సభ్యులు కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రయ్య, వెంకటేష్, విద్యాసాగర్, ఎన్ఎంసీ యువ నాయకుడు ప్రవీణ్, సలీం, మహిళా నాయకురాళ్లు లలితారెడ్డి, భారతి, యువ నాయకులు ప్రవీణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్‌లో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు బీజేపీ నాయకుల వినతి

నిజాంపేట్, జూన్9(సిటీ టైమ్స్):

ప్రగతి నగర్ డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ నాయకులు హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులను కోరారు. ఈ మేరకు స్థానిక ప్రజలు, రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. డివిజన్‌లో అసమర్థ నీటి సరఫరా, తరచూ జరుగుతున్న పైప్‌లైన్ లీకేజీలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అదనపు నీటి కేటాయింపు అవసరం, అలాగే క్యాన్ నంబర్లు లేని నీటి కనెక్షన్లకు వెంటనే క్యాన్ నంబర్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి మాట్లాడుతూ, తాగునీటి సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు చొరవ చూపాలని కోరారు.ప్రధాన కార్యదర్శి మధన్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు అనూరుద్ర, సీనియర్ నాయకులు ఆనందోబ్రహ్మ, సుభదీర్, స్థానిక రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, కిషోర్ రెడ్డి, పవన్ తదితరులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారి రజనీకాంత్ రెడ్డిని కలిసి తాగునీటి సమస్యలపై చర్చించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ 100 కోట్ల అవినీతి చిట్టా

మాదాపూర్, సిటీ టైమ్స్


హైదరాబాద్ మాదాపూర్‌లోని రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇళ్లు, ఆఫీసుల్లో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో.. మోహన్ నాయక్ ఇంటితోపాటు.. ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల నివాసాలు కలిపి.. 11 ఇతర ప్రాంతాల్లో ఏకంగా 16 ఏసీబీ టీంలు ఒకేసారి తనిఖీలు నిర్వహించాయి. తెల్లవారుజామునే తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా డబ్బు, బంగారం, మద్యం బాటిళ్లు దొరికినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఇక ఇప్పటివరకు బయటపడ్డ వివరాల ప్రకారం.. ఆయన ఆస్తులు మొత్తం రూ.100 కోట్లకు పైనే ఉంటాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇప్పటిదాకా.. రూ.60 లక్షల నగదు, 3 కిలోల బంగారం, 35 మద్యం సీసాలు, భారీగా ఆస్తి పత్రాలు లభించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. అందులో 15 బంగారు బిస్కెట్లు కూడా ఉన్నట్లు తెలిపారు. వీటితోపాటు హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన వ్యవసాయ భూములు ఉన్నాయని.. వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పేపర్లను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మోహన్ నాయక్ అక్రమాస్తులపై 16 ఏసీబీ బృందాలు తనిఖీలు చేస్తున్నాయని వివరించారు. సాయంత్రం వరకు మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.

2025 సెప్టెంబర్‌లో ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా మోహన్ నాయక్ పదవిలోకి వచ్చారు. అంతకుముందు స్టేట్ రోడ్స్ చీఫ్ ఇంజినీర్‌గా, ఆర్డీసీ (రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఎండీగా మోహన్ నాయక్ పలు విభాగాల్లో విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం మోహన్ నాయక్‌కు ఈఎన్సీగా ప్రమోషన్ ఇచ్చింది. అయితే.. ఆర్ అండ్ బీ ఈఎన్‌సీగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం కూడా గడవకముందే మోహన్ నాయక్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఏకకాలంలో చాలా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి.. మోహన్ నాయక్ అవినీతి చిట్టాను బయటికి తీశారు.

తన హోదాను అడ్డం పెట్టుకుని ఆర్అండ్‌బీ శాఖలో టెండర్లు, కాంట్రాక్టుల కేటాయింపుల్లో మోహన్ నాయక్ భారీ ఎత్తున అవినీతి చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల రూపంలో భారీగా డబ్బులు తీసుకున్నట్లు చాలా రోజులుగా ఆరోపణలు ఉన్నట్లు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మోహన్ నాయక్ ఆర్థిక లావాదేవీలపై రహస్య నిఘా పెట్టి.. పక్కా సమాచారంతోనే దాడులు చేసినట్లు పేర్కొన్నారు.

# జీతాలు ఇవ్వకుండా వేధింపులు



**- మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని..**

**- నెల నెలా శాలరీలు ఇవ్వడం లేదు**

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.

**ఎమ్మెల్యే హరీశ్ రావు ఎక్స్ పోస్టు..**

'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. మాయమాటలు చెప్పి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక అబద్ధాల ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ వైఖరి ఉంది. సమస్యల పరిష్కారం కోసం 'ఛలో సెక్రటేరియట్' పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి దుర్మార్గమైన చరిత్రను కాంగ్రెస్ మూటకట్టుకుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీల వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ పోస్టు పెట్టారు.

# గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులను ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ , డైట్ ఛార్జీల పెంపు వంటి నిర్ణయాలతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేదవాడి ఆత్మగౌరవం కోసం రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అందులో కేవలం అశ్వారావుపేట నియోజకవర్గానికే నాలుగు వేల ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. చివరి పేదవాడి వరకూ లబ్ధి చేకూరుస్తామని చెప్తూ, భూమి లేని పేద ఆడబిడ్డల కోసం ఐదెకరాల్లో G+3 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాడు కేవలం పింక్ కలర్ పార్టీ వారికి మాత్రమే అందిన లబ్ధి, నేడు ప్రతి పేదవాడికి చేరుతోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలో మార్పుల గురించి ప్రస్తావిస్తూ అశ్వారావుపేటలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ కులమతాలకు, పేద ధనిక తారతమ్యం లేకుండా సుమారు 2300 మంది విద్యార్థులు చదువుకుంటారని చెప్పారు. దీనితో పాటు త్వరలోనే ఇక్కడ అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్‌ను కూడా తీసుకురానున్నట్లు ప్రకటించారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అశ్వారావుపేటకు వంద పడకల ఆసుపత్రిని, నర్సింగ్ కాలేజీని మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. స్థానికంగా కొమురం భీమ్ అర్బన్ పార్క్ ప్రారంభం, పూసుకుంట కొండ రెడ్ల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ పేదవాడి ప్రభుత్వమని, భవిష్యత్తులో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు , పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల శ్రమకు గుర్తింపునివ్వాలి



**- బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, జూన్ 9 (సిటీ టైమ్స్):**

భవన నిర్మాణ కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు లభించడంతో పాటు వారి పనికి తగ్గ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో తెలంగాణ భవన ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ సుభాష్ నగర్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిర్మాణ వ్యయాల నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుల జీవన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారికి న్యాయమైన వేతనాలు అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ రంగ కార్మికుల కష్టాన్ని గుర్తించి వారి సంక్షేమానికి ప్రభుత్వం, యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, సంబంధిత అధికారుల దృష్టికి అంశాలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ సుభాష్‌నగర్ కమిటీ అధ్యక్షుడు పి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పి. వెంకయ్య, కార్యదర్శి వి శ్రీనివాస్ తో పాటు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ ఎస్ఎన్డిపి పనులపై విజిలెన్స్ విచారణ జరపాలి



**- అవినీతి, నాసిరకం పనుల వల్ల నరకయాతన అనుభవిస్తున్న ప్రజలు**

**- బీజేపీ నేత బిక్షపతి యాదవ్**

**నిజాంపేట్, జూన్ 9(సిటీ టైమ్స్):**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజాంపేట్ బండారి లేఔట్ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు. బండారి లేఔట్‌లో పర్యటించిన ఆయన స్థానిక ప్రజల సమస్యలను పరిశీలించి మీడియాతో మాట్లాడారు.

అప్పటి కార్పొరేటర్లు కమిషన్లకు కక్కుర్తిపడి ఎస్ఎన్‌డీపీ పనులను నాసిరకంగా నిర్వహించారని ఆయన ఆరోపించారు. నాలాల నిర్మాణంలో ఎలాంటి ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల వర్షపు నీటి సమస్య మరింత తీవ్రమైందన్నారు. అధికారులకు, అప్పటి కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు రూ.150 కోట్ల వ్యయంతో తొమ్మిది ప్రాంతాల్లో ఎస్ఎన్‌డీపీ పనులకు టెండర్లు ఖరారు చేసినప్పటికీ, అనేక చోట్ల పనులు అసంపూర్తిగా ఉండగానే బిల్లులు చెల్లించారని బిక్షపతి యాదవ్ విమర్శించారు. ముఖ్యంగా బండారి లేఔట్ రోడ్డు నంబర్లు 1 నుంచి 10 వరకు వచ్చే వరద నీటిని సరైన మార్గంలో మళ్లించకుండా సగం వరకు మాత్రమే పైపులు వేసి వదిలేయడం వల్ల చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోతోందని తెలిపారు.

ఎస్ఎన్‌డీపీ నాలాలకు డ్రైనేజీ పైపులను అనుసంధానం చేయడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలకు కారణమైన వారే ఇప్పుడు నిరసనలు చేపట్టడం ప్రజలను మోసం చేయడమేనని వ్యాఖ్యానించారు.

జీవో నంబర్ 286/2021 ప్రకారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం జీహెచ్ఎంసీ ద్వారా విడుదల చేయాల్సి ఉండగా, నిజాంపేట్ కార్పొరేషన్ నుంచి సుమారు రూ.30 కోట్లు చెల్లింపులు జరగడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బిక్షపతి యాదవ్ తెలిపారు. కార్పొరేషన్ నిధుల నుంచి చెల్లించిన ఆ రూ.30 కోట్లను తిరిగి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంట్రాక్టర్లకు జరిగిన చెల్లింపుల్లో భారీ స్థాయిలో కమిషన్లు చేతులు మారాయనే ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరిపి నిజాలను వెలికితీయాలని కోరారు.

అప్పటి కమిషనర్ వంశీకృష్ణతో పాటు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రపై కూడా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డీపీ పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని, లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బిక్షపతి యాదవ్ హెచ్చరించారు.



# మహిళా డిగ్రీ కళాశాలకు చెత్త కష్టాలు





**- 15 రోజుల్లో డంపింగ్ యార్డ్ తరలించండి**

**- అధికారులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశం**

**కుత్బుల్లాపూర్ , జూన్ 9(సిటీ టైమ్స్):**

ఏడాది క్రితమే నిర్మాణం పూర్తయిన మహిళా డిగ్రీ కళాశాల పక్కనే చెత్త డంపింగ్ యార్డ్ ఉండటంతో విద్యార్థుల ప్రవేశాలు నిలిచిపోయిన విషయం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దృష్టికి వెళ్లింది. సమస్య తీవ్రతను స్వయంగా పరిశీలించిన మంత్రి, డంపింగ్ యార్డ్‌ను 15 రోజుల్లోగా అక్కడి నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు.

బాచుపల్లిలో నిర్మించిన మహిళా డిగ్రీ కళాశాలను మంత్రి మంగళవారం సందర్శించారు. కళాశాల నిర్మాణం పూర్తై సంవత్సరం గడిచినా, పక్కనే కొనసాగుతున్న చెత్త డంపింగ్ కారణంగా అడ్మిషన్లు ప్రారంభించలేకపోతున్నామని కళాశాల సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కళాశాల పరిసరాలను పరిశీలించిన మంత్రి, చెత్త దుర్వాసన మరియు కాలుష్య పరిస్థితుల్లో విద్యార్థులు చదువుకునే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు.

డంపింగ్ యార్డ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరీ, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌లకు మంత్రి సూచించారు. యార్డ్ తరలింపునకు నెల రోజుల సమయం కావాలని కమిషనర్ ఫోన్‌లో కోరగా, అంత గడువు అవసరం లేదని స్పష్టం చేసిన మంత్రి, 15 రోజుల్లోగా సమస్యను పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరీ, మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్, నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ, బాచుపల్లి తహసీల్దార్ వాణి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయన్ కూతురికి ఈడీ సమన్లు...

**తిరువనంతపురం, సిటీ టైమ్స్**

సీఎమ్ఆర్ఎల్ ఎక్సాలాజిక్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ కేసుకు సంబంధించి 'ది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూతురు వీణా విజయన్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 12వ తేదీన (శుక్రవారం) కొచ్చిలోని ఆఫీస్‌లో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వీణా విజయన్‌తో పాటు 9మందికి ఈడీ సమన్లు జారీ చేసింది.

**కేసు వివరాలు..**

పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు చెందిన ఐటీ కన్సల్టెన్సీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. ప్రైవేట్ మైనింగ్ కంపెనీ అయిన సీఎమ్ఆర్ఎల్‌తో ఓ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం కింద సీఎమ్ఆర్ఎల్ కంపెనీ.. వీణా విజయన్ కంపెనీకి 1.72 కోట్ల రూపాయల నుంచి 2.78 కోట్ల రూపాయల వరకు చెల్లించింది. అయితే, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి ఎలాంటి ఐటీ సేవలు అందించకుండానే ఈ మొత్తాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యమంత్రితో ఉన్న కుటుంబ సంబంధాల వల్లే ఈ అక్రమ చెల్లింపులు జరిగాయని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలోనే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వీణా విజయన్‌పై కంపెనీల చట్టం కింద కేసు నమోదు చేసింది. అంతేకాదు.. ఈ నిధుల మళ్లింపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ చట్టంకింద విచారణ చేపట్టింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మే 26వ తేదీన విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఇప్పుడు వీణా విజయన్‌కు నోటీసులు ఇచ్చారు.









## గోదాములు మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని
# ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలి



**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి సిటీ టైమ్స్ జూన్ 09

మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీరంగాపురం మండలం పరిధిలోని లక్ష్మి వారహి ఇండస్ట్రీ, పెబ్బేరు పరిధిలో రాధాకృష్ణ ఇండస్ట్రీస్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆయా మిల్లుల గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. లారీలలో ఉన్న ధాన్యం పై టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు.

మిల్లుల వద్ద లారీలను ఎక్కువ సమయం వేచి ఉంచకుండా తగ్గించేందుకు గాను హమాలీల (కార్మికుల) సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ అన్లోడ్ సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. ఇంకా ధాన్యం నిల్వ చేయడానికి గోదాములను సిద్ధం చేయాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు.

జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు

## మహిళలను కోటీశ్వరులను చేయడం దేవుడెరుగు
# మహిళలకు ఇస్తామన్న 2500 ఇవ్వండి



**- ఇందిరా మహిళా శక్తి కింద 400 బస్సులు అనేది మహిళలను మోసం చేయడమే**
**- అబద్ధాల పాలన ఆగం కాక తప్పదు**
**- జిల్లా మీడియా కన్వీనర్**
**- నందిమల్ల అశోక్**

వనపర్తి సిటీ టైమ్స్ జూన్ 09


హిట్లర్ ను అనుసరిస్తున్న రేవంత్ రెడ్డి విధానాలు ఫాసిస్టు చర్యలను తలపిస్తుంది మహిళలను కోటీశ్వరులను చేసే ప్రక్రియలో భాగంగా ఆర్ టి సి బస్సులకు మరియు పెట్రోల్ బంకులకు యజమానులు చేస్తే అని చెప్పి నేటికి ఏ బస్సుకు ఏ పెట్రోల్ బంకులకు యజమానులను చేశారో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్ చేశారు ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మంగళవారం రోజు 400బస్సులు కేటాయిస్తున్నామని ఆర్భాటం చేస్తూ ప్రారంభించడాన్ని మరోసారి మహిళలను మోసం చేయడమే అని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ దుయ్యబట్టారు వివిధ డిపోలలో ఉన్న పాత బస్సులను కొత్తగా రంగులు వేసి రాజధానికి తరలించి నూతన బస్సులకు మహిళలను యజమానులను చేస్తున్నానని రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నాడు అశోక్ విమర్శించారు వనపర్తి డిపోకు చెందిన బస్సులకు అలంపూర్ మహిళా సమాఖ్య అని పేర్లు స్టిక్కర్లు వేసి చూయించడం రేవంత్ రెడ్డి పాలనకు పరాకాష్ట నిజంగా మహిళలకు బస్సులు కేటాయించి ఆర్థికంగా అభివృద్ధి చేయాలనుకుంటే నూతన బస్సులు కొనుగోలు చేసి వారికి కేటాయించాలని అశోక్ డిమాండ్ చేశారు.

మహిళలకు ఇచ్చిన హామీల నుండి దృష్టి మళ్లించడానికి వాగ్దానం చేసిన పథకాలు ప్రతి మహిళకు 2500,తులం బంగారం కె సి ఆర్ కిట్టు గ్యాస్ సబ్సిడీ స్కూటీలు ఇవ్వకుండా రోజుకో అబద్ధం చెబుతూ రేవంత్ రెడ్డి చేస్తున్న డ్రామాలు మహిళలు గమనిస్తున్నారని సరైన సమయంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అశోక్ విమర్శించారు.

బస్సుల కేటాయింపులో గందరగోళం. హిళా సమాఖ్య పేరిట కేటాయిస్తున్న బస్సులు ఆర్ టి సి ఆపరేటింగ్ చేస్తుందా అందులో నుండి వచ్చే రాబడి తిరిగి సమాఖ్యకు చెల్లిస్తారా ప్రత్యేకంగా సిబ్బందిని రిక్రూట్మెంట్ చేస్తారా వంటి అంశాలపై స్పష్టత లేదని అశోక్ అన్నారు. ప్రతి బహిరంగ సభకు మహిళలను తరలిస్తూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ వారి విలువైన సమయాన్ని వృథా చేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి రేవంత్ రెడ్డి ఆటంకం కలిగిస్తున్నాడని అశోక్ ఆరోపించారు. మహిళా ఓట్లతోనే మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవచ్చు అనే దుర్బుద్ధినీ మహిళలు తిప్పికొట్టి మీ పాలనకు మంగళం పాడడం ఖాయమని అశోక్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు నీలస్వామి మైనార్టీ సెల్ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్ మండల యువత అధ్యక్షులు చిట్యాల రాము ఉన్నారు

# నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులు రానున్న మూడు నెలల్లో పూర్తి చేయడమే లక్ష్యం







**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి ప్రతినిధి జూన్ 9 (సిటీ టైమ్స్)

వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ అంశంపై అధికారులు ప్రథమ ప్రాధాన్యతగా పనిచేయాలని సూచించారు. రానున్న మూడు నెలల్లో జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులు రానున్న మూడు నెలల్లో పూర్తి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొదటి ప్రాధాన్యతగా బుద్ధారం పెద్ద సముద్రం కు సంబంధించి 101 ఎకరాలు, గణప సముద్రం కు సంబంధించి 164 ఎకరాలు, తూముకుంట, సంగినేనిపల్లి కల్వకు సంబంధించి 94 ఎకరాల భూ సేకరణ వేగంగా అడుగులు ముందుకు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైన పేర్కొన్న భూములకు సంబంధించి మొత్తం ఎంతమంది రైతులు ఉంటారు, వారిలో పట్టా రైతులు ఎంతమంది అనే వివరాలతో డేటా తయారు చేయాలన్నారు. జిల్లాస్థాయి నెగోసియేషన్ కమిటీ ఏర్పాటు చేసి తేదీలు ఖరారు చేసుకుని క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నష్టపరిహారం గురించి చర్చించాలన్నారు. కమిటీ సమావేశం గురించి ముందస్తుగానే రైతులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. జులై మొదటి వారంలోగా ఆయా భూములకు సంబంధించి అవార్డులు పూర్తి చేసే విధంగా పనులు ముమ్మరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నివీర్‌గా పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బి గణేష్ ఎంపిక





వనపర్తి సిటీ టైమ్స్ జూన్ 09

పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 20222024 విద్యా సంవత్సరంలో సీఈసీ (ఇంగ్లీష్ మీడియం) పూర్తి చేసిన బి.గణేష్ అగ్నివీర్ (ఆర్మీ) ఉద్యోగానికి ఎంపికై కళాశాలకు గర్వకారణంగా నిలిచాడు. శాఖాపురం గ్రామానికి చెందిన యాదగిరి, చంద్రకళ దంపతుల కుమారుడైన గణేష్, తన పట్టుదల, క్రమశిక్షణతో ఈ ఘనత సాధించాడు. బెంగళూరులోని ASC 1 మిలిటరీ ట్రైనింగ్ సెంటర్‌కు శిక్షణ కోసం వెళ్లే ముందు, గణేష్ కళాశాలను సందర్శించి అధ్యాపకుల ఆశీస్సులు తీసుకున్నాడు. తన విజయానికి అధ్యాపకుల సలహాలే కారణమని గణేష్ కృతజ్ఞత తెలపగా, ప్రిన్సిపాల్, అధ్యాపకులు హనుమంత్ రెడ్డి, సి. కృష్ణయ్య, జ్ఞానేశ్వర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, వెంకటలక్ష్మి, శిల్ప మరియు బోధనేతర సిబ్బంది విద్యార్థిని పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి, దేశ సేవలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.



# అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు పెట్టే భోజనం కలుషితానికి తావు లేకుండా చూడాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి ప్రతినిధి జూన్ 9 (సిటీ టైమ్స్)

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలు, గర్భిణులు భోజనం చేస్తారని అందువల్ల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు వారి భోజనం విషయంలో పరిశుభ్రతలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం ఐ.డి. ఓ సి సమావేశ మందిరంలో ప్రపంచ ఆహార భద్రత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, సి.డి.పి. ఓ లు పాల్గొనగా నవీన్ ఆహార భద్రత, పరిశుభ్రత పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతలు పాటించాలని, వంట చేసే ఆయాలు పరిశుభ్రంగా ఉండడం, చేతులు బాగా కడుక్కుని వంట సామానులు, ఆహార పదార్థాలు ముట్టుకోవడం వంటివి చేయాలని సూచించారు. కూరగాయలు బాగా కడిగిన అనంతరం వాటిని వాడటం, పాత్రలు సబ్బుతో కడిగి వేడి నీళ్లతో శుభ్రం చేసుకోవడం, స్టోర్ రూమ్ కు మంచి గాలి, వెలుతురు ఉండే విధంగా చూసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సరిగ్గా ఉడకని చికెన్ ఒక గర్భిణి తింటే గర్భిణితో పాటు కడుపులో ఉన్న శిశువు సైతం అనారోగ్యానికి గురవుతుందని ఉదాహరణగా చెప్పారు.అదేవిధంగా చిన్న పిల్లలు తినేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి విషయాలు చిన్నప్పటి నుంచే నేర్పించాలని చెప్పారు. జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కరుణాకర్, డి.సి.పి.ఓ రాంబాబు, సి.డి.పి. ఓ లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో ఉన్న సుధాకర్ రెడ్డి ని పరామర్శించిన : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి సిటీ టైమ్స్ జూన్ 9

వనపర్తి మండలం రాజపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వేణు రెడ్డి, సుదర్శన్ రెడ్డి ల సోదరుడు సుధాకర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,వనపర్తి పట్టణంలోని బండారు నగర్‌లో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య చికిత్స తీసుకోవాలని మరియు మనోధైర్యంగా ఉండాలని సూచించారు వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి వెంట నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ఉంగ్లం తిరుమల్, జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము, లక్ష్మణ్ గౌడ్, పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన రైతులు, విద్యార్థులు, స్వయం ఉపాధి లబ్ధిదారులకు రుణాలు అందించడంలో బ్యాంకులు మరింత చొరవ చూపాలి





**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**
**- రుణాల మంజూరులో లక్ష్యాలను అధిగమించిన మూడు బ్యాంకులకు ప్రత్యేకంగా అభినందనందించిన కలెక్టర్**

**వనపర్తి ప్రతినిధి జూన్ 9 (సిటీ టైమ్స్)**

రైతులు, విద్యార్థులు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, మెప్మా సంఘాలు, స్వయం ఉపాధి రంగాలకు రుణాల మంజూరులో బ్యాంకులు మరింత చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (DCC) మరియు డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (DLRC) సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా చేపట్టిన రుణాల పురోగతిపై కలెక్టర్ ఈ సమావేశంలో సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ, ఎం ఎస్ ఎం ఈ, విద్య, స్వయం సహాయక సంఘాల, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు పై కేటగిరి వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 5,990 కోట్ల జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని విడుదల చేశారు. విడుదల చేసిన వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం బ్యాంకులు ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, మెప్మా సంఘాలు, స్వయం ఉపాధి రంగాలకు రుణాల మంజూరులో బ్యాంకులు మరింత చొరవ చూపాలని ఆదేశించారు. రుణాల మంజూరులో సిబిల్ స్కోర్‌ను ఒక ప్రమాణంగా పరిగణించినప్పటికీ, అర్హులైన రైతులు, విద్యార్థులు, స్వయం ఉపాధి లబ్ధిదారులు రుణాల కోసం తిరస్కరణకు గురికాకుండా బ్యాంకులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో కొన్ని బ్యాంకులు వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నాయని, అటువంటి బ్యాంకులు వెంటనే తమ పనితీరును మెరుగుపరుచుకుని లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. బ్యాంకులు అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించి వ్యవసాయం, స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు (MSME) తదితర రంగాలకు విస్తృతంగా రుణాలు అందించాలని కోరారు. అలాగే ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి ముద్ర యోజన తదితర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత గడువులో రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని బ్యాంకర్లను కోరారు.ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ పథకాలను సమీక్షించిన కలెక్టర్ లబ్ధిదారులకు రుణాల మంజూరులో ఆలస్యం అవకుండా కారణాలను తెలుసుకొని పరిష్కరించే ప్రయత్నం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పథకాల విషయంలో బ్యాంకులు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు సమన్వయం చేసుకొని లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు అయిన సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజనకు సంబంధించి ప్రతి బ్యాంకు లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఖాతాదారులందరికీ ఈ బీమా పథకాలను అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల కింద రుణాలు తీసుకునే ప్రతి ఒక్క లబ్ధిదారుకు బీమా పథకాలను వర్తింపజేయాలని తెలియజేశారు. విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా రుణాల విషయంలో బ్యాంకులు ఆలస్యం చేయకుండా, నిబంధనల మేరకు రుణాలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. అలాగే విదేశీ విద్య లేదా ఉన్నత విద్య కోసం అధిక మొత్తంలో రుణాలు అవసరమైన విద్యార్థులకు విద్యా రుణాలు మంజూరు చేసే అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో లక్ష్యాలను సాధించడమే కాకుండా అంతకుమించి రుణాలను మంజూరు చేసిన మూడు బ్యాంకులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, మెమెంటోను అందజేశారు. జిల్లా కేంద్రంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతినిధులకు ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ప్లంబింగ్, కుకింగ్, ఏసీ రిపేరు వంటి వాటికి బాగా డిమాండ్ ఉందని, అటువంటి కోర్సులను అందుబాటులో ఉంచి ఆసక్తి కలిగిన వారికి శిక్షణ అందించాలని సూచించారు. అంతేకాకుండా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రానికి సంబంధించి అందజేస్తున్న కోర్సుల గోడ పత్రికను ఆవిష్కరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన రూ. 5,339 కోట్ల వార్షిక రుణ లక్ష్యాలకు గాను జిల్లాలో ఉన్న బ్యాంకులన్నీ రూ. 4,943 కోట్ల రుణాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం మీద నిర్దేశించిన లక్ష్యాలకు గాను 92.58% రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా నాబార్డ్ డి డి ఎం మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళిక రూపొందించడానికి కావాల్సిన సమాచారాన్ని వివిధ శాఖల వారిని కోరడం జరిగిందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, ఆర్బీఐ ఎల్డిఓ డాక్టర్ ప్రదీప్ చంద్ర, నాబార్డ్ డి డి ఎం మనోహర్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం మురళీకృష్ణ, ఎస్బిఐ ఆర్ఎం శ్రీ చరణ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్, ఇతర బ్యాంకు ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంగించి ప్రైవేట్ పాఠశాలలు నడుపిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**- ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్.**

**వనపర్తి సిటీ టైమ్స్ జూన్ 9**



ప్రభుత్వ సెలవులు పూర్తి కాకముందే ప్రైవేట్ పాఠశాలలు నడిపిస్తున్న పాఠశాలల మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు.వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల ప్రభుత్వ సెలవులు పూర్తి కాకముందే పాఠశాలలు నడుపుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు తక్షణమే అక్కడికి వెళ్లి స్కూల్ ని బంద్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంగించి ప్రభుత్వ సెలవులు పూర్తి కాకముందే ప్రైవేట్ పాఠశాలలు ఇష్టనుసారంగా పాఠశాలలు నడిపిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గతంలో మండల విద్యాధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అయినా నేడు ఓ ప్రైవేట్ పాఠశాల పాఠశాల నడిపియడం జరుగుతుంది దీనిపై మండల విద్యాశాఖ అధికారి నిబంధనలు ఉల్లంగించిన వారిపై తక్షణమే సంబంధిత చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయా విద్యార్థి పరిషత్ కోరుతున్నాము లేని యెడల ఏబీవీపీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంది అని హెచ్చరిస్తునాం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ, నగర కార్యదర్శి శివ, అర్జున్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల రెక్కల కష్టాలు సంపన్నులకు దోచిపెడుతున్న మోడీ..







**- రమేష్ కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి...**

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ జూన్ 9**

డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల రెక్కల కష్టాన్ని ప్రధాని నరేంద్ర మోడీ సంపన్నులకు దోచి పెడుతున్నారని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ ఆరోపించారు. మంగళవారం సిపిఐ ఆఫీస్ లో మాట్లాడుతూ.. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెంపకం నిత్యవసర వస్తువుల ధరలన్నీ చుక్కలంటాయని, సామాన్యుడు కొని తిని బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కష్టజీవుల వేతనాలు ఆదాయం ఆదాయం పెరగకపోగా ధరలు మాత్రం పెరిగాయని కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉప్పు పప్పు నూనెలు సబ్బులు దుస్తులు అన్ని వస్తువులు, కూరగాయల ధరలు సైతం పెరిగాయి అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయటం లేదని విధిలేక వారి శ్రమను తక్కువ ధరకే అమ్ముకుంటున్నారన్నారు. తక్కువ వేతనానికే పని చేస్తుండగా పని గంటలు మాత్రం ఎనిమిది నుంచి పదికి పెంచడం దుర్మార్గమన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందని.వనపర్తి కలెక్టరేట్ వద్ద రేపు ఉదయం 11 గంటలకు ధర్నా ఉంటుందని పోరాటాలతో మోదీ మెడలు వంచేందుకునియోజకవర్గ వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, లక్ష్మీనారాయణ, విజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# గుడూషాను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



**- గుడుషా కు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరిన మాజీ ఎమ్మెల్యే ఆల**

**కొత్తకోట సిటీ టైమ్స్ జూన్ 9:**

మదనాపురం మండలం కొన్నూరు గ్రామ సర్పంచ్ రసూల్ బి భర్త గుడూషా గాల్ బ్లాడర్ సంబంధిత ఆరోగ్య సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని శ్రీకర్ హాస్పిటల్‌కు వెళ్లి ఆయనను పరామర్శించారు. గుడుషా ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలపై ఆరా తీశారు. త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గుడూషా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆల వెంకటేశ్వర్ రెడ్డి వెంట బాలరాజ్ యాదవ్, దావూద్ హుస్సేన్ పాల్గొన్నారు. గుడూషా త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.







# పోలీసు వాహనాల పాత విడిభాగాల బహిరంగ వేలం విజయవంతం



**- అదనపు ఎస్పీ : రాజేష్ మీనా**
**- అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహణ...**
**- పోటాపోటీగా పాల్గొన్న వ్యాపారులు – వేలంలో పాత టైర్లు, బ్యాటరీలు, విడిభాగాలు సొంతం...**
**- వ్యాపారుల భారీ స్పందన మధ్య పోలీసు వేలంపాట ఘన విజయం...**

**వనపర్తి క్రైమ్ సిటీ టైమ్స్ జూన్ 09**

మంగళవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, బ్యాటరీలు మరియు ఇతర వాహన విడిభాగాల బహిరంగ వేలం విజయవంతంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్.,ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్., ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి పర్యవేక్షణలో జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ఈ వేలంపాటను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించారు. వేలంపాటలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా బిడ్లు దాఖలు చేశారు. పోలీసుశాఖ వినియోగంలో లేని పాత టైర్లు, బ్యాటరీలు మరియు ఇతర వాహన విడిభాగాలను 82,600 రూపాయల కు సొంతం చేసుకున్నారు.వేలంపాట ప్రక్రియ మొత్తం ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించబడిందని అధికారులు తెలిపారు. పాల్గొన్న వ్యాపారులు కూడా వేలంపాట నిర్వహణ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసు వాహనాల అధికారి (ఎం.టి.ఓ.), రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పోలీసు శాఖ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తూ వేలంపాటను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ వేలం పాటలలో మోటార్ వాహనాల రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్దుమ్ బారి, కొనుగోలుదారులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# ఆర్.ఎల్ .నగర్‌లో అక్రమ షెడ్ల సంచలనం



- నాగారంలో అక్రమ నిర్మాణాల కలకలం..
- అనుమతుల్లేక షెడ్ల నిర్మాణం బహిరంగంగా..
- అధికారుల హడావిడి చర్యలపై విమర్శలు..
- పనులు ఆపాలని చెప్పినా మళ్లీ కొనసాగింపు..
- ముడుపులే కారణమా..? చర్చ జోరు..
- కూల్చివేయాలని స్థానికుల డిమాండ్..

**నాగారం జూన్ 09,(సిటీ టైమ్స్):**

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్ల నిర్మాణాలు బహిరంగంగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కొందరి అవినీతి కారణంగానే ఈ అక్రమ నిర్మాణాలు ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పేరుకే స్పందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణ స్థలాలకు వెళ్లి కొద్దిసేపు హడావిడి చేస్తూ పనులు నిలిపివేయాలని హెచ్చరికలు జారీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే అధికారులు వెళ్లిన వెంటనే నిర్మాణదారులు మళ్లీ పనులు ప్రారంభిస్తున్నారని, దీనికి అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.దీంతో అధికారులు, నిర్మాణదారుల మధ్య గుట్టుచప్పుడు కాకుండా లావాదేవీలు జరుగుతున్నాయనే చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. ఇదే క్రమంలో ఆర్.ఎల్. నగర్ నుంచి రాంపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్డు నిర్మాణం చేపట్టడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ఒక్కరోజులోనే భారీ షెడ్డు నిర్మాణం పూర్తికావడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంత పెద్ద నిర్మాణం ఒకే రోజులో పూర్తికావడం వెనుక అధికారులకు ముడుపులు అందాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ స్థలానికి చేరుకుని పనులు నిలిపివేయాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే కొద్దిసేపు హడావిడి చేసిన అనంతరం అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో మళ్లీ పనులు కొనసాగి చివరకు షెడ్డు నిర్మాణం పూర్తయిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో అధికారుల చర్యలపై మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "అధికారులు వచ్చి హడావిడి చేయడం ఎందుకు..? పనులు ఆపించడం ఎందుకు..? చివరకు నిర్మాణం పూర్తవడం ఎలా..?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇది కేవలం కంటి తుడుపు చర్యలేనా..? లేకపోతే వెనుక పెద్ద స్థాయిలో అవినీతి జరుగుతోందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారా..? లేకపోతే ఎవరి ఒత్తిడి కారణంగానైనా ఈ వ్యవహారాన్నిపట్టించుకోవడం లేదా..? అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏది ఏమైనప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన ఈ భారీ షెడ్డు పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.లేకపోతే భవిష్యత్తులో నాగారం డివిజన్ మొత్తం అక్రమ నిర్మాణాలకు కేంద్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 26 వేలు ఇవ్వాలి



- వేతనాలు పెంపుదల కోసం భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధం కావాలి
- రీజనల్ సెక్రెటరీ అక్బర్ అలీ పిలుపు

**కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,**

సింగరేణిలో పనిచేస్తున్న అన్ని భాగాల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించాలని ఏఐటీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎస్ డి.అక్బర్ అలీ డిమాండ్ చేశారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల గేట్ మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన వేతనాలు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర నష్టం జరిగే విధంగా ఉన్నాయని, అనేక సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న వేతన సవరణలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా శాస్త్రీయంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంచ లేదని విమర్శించారు. ఒక పక్కన కోల్ ఇండియాలో చెల్లిస్తున్న వేతనాలకు సింగరేణి లో అమలు చేస్తున్న వేతనాలకు చాలా వ్యత్యాసం ఉన్నదని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు అరకొర వేతనాలతో జీవితాలను కొనసాగించవలసి వస్తుందని, ఎట్టి చాకిరికి, శ్రమ దోపిడీకి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంట్రాక్ట్ కార్మికుల ఆశలు అడియాసలు అయ్యాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జోన్ల విధానం వల్ల ప్రస్తుతం పొందుతున్న వేతనాలు ఇంకా తగ్గిపోయే అవకాశం ఉన్నదని అన్నారు. కోలిండియా మాదిరిగా సింగరేణిలో కూడా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న ఈఎస్ఐ, నో వర్క్ నో పే సర్క్యులర్స్ తక్షణమే విడుదల చేయాలని కోరారు. చేస్తున్న పని ఆధారంగా అనేక విభాగాలలోని కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్డ్ , సెమి స్కిల్డ్, హైలీ స్కిల్డ్ వేతనాలను చెల్లించాలని , యాజమాన్యం సీఎం పిఎఫ్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, సకాలంలో కాంట్రాక్ట్ కార్మికుల పిఎఫ్ ఖాతాలలో నగదును జమ చేయాలని, వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్, ఆఫీస్ బ్యారర్స్ వీరస్వామి, అఫ్రోజ్ ఖాన్, కృష్ణ ఫర్, మల్లయ్య, ఎం చంద్రశేఖర్, సిహెచ్ శ్రీను, నరసింహ, వినోద, శివ, రాజేష్, సురేందర్ వివిధ ఏరియాలో బ్రాంచి బాధ్యులు పాల్గొన్నారు.

# అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



- సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు డిమాండ్

**కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,**


**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవుట్ సోర్సింగ్ గా పనిచేస్తున్న ఏఎన్ఎం ల మూడు నెలల పెండింగ్ జీతాలను విడుదల చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ పిపి యూనిట్ లో పనిచేస్తున్న ఏఎన్ఎం లను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లిక్కి బాలరాజు మాట్లాడుతూ గత మూడు నెలల నుండి ఏఎన్ఎం లకు రావలసిన జీతాలు విడుదల చేయక ఏఎన్ఎంలు కుటుంబ పోషణకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే అరకొర జీవితంలోనే వారి యూనిఫామ్ లు కూడా కొనుక్కోమని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వమే ఏఎన్ఎం లకు యూనిఫాం అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవుట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఏఎన్ఎం లకు పని భద్రత లేదని వారికి పీఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యం కూడా సక్రమంగా అమలు కావట్లేదని ఆరోపించారు. అధికారులు వీరితో చాకిరి చేయించుకోవడమే తప్ప వారి జీతాల కోసం వారి భద్రత కోసం ఏమాత్రం పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. మూడు నెలలుగా జీతాలు రాకపోయినా పట్టించుకోని జిల్లా అధికారులు పనిచేయాలంటూ ఏఎన్ఎంలపై తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని దీని వలన ఏఎన్ఎంలు మానసిక ఇబ్బందులకు కూడా గురవుతున్నారని ఆరోపించారు. ఏఎన్ఎం లకు పెండింగ్ జీతాలు తక్షణమే విడుదల చేసి వారికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో పాటు యూనిఫామ్ అలవెన్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వం పట్టించుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి , సోనియా , అనిత , సమ్మక్క, భవాని , జ్యోతి తదితరులు పాల్గొన్నారు .**

# బెల్ట్ షాపులపై ఉక్కు పాదం మోపుతున్న గ్రామపంచాయతీలు



- గ్రామాల్లో సంతోషకరమైన వాతావరణం

**భీమదేవరపల్లి**
**జూన్ 9 ( సిటీ టైమ్స్ )**




మద్యానికి బానిసలై కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని భావించిన గ్రామపంచాయతీలు ఏకంగా తమ గ్రామాల్లో బెల్ట్ షాపులను నిషేధిస్తూ తీర్మానాలను చేస్తున్నాయి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని అన్ని గ్రామాల్లో సుమారు 125 బెల్ట్ షాపులను అధికారుల కను సైగల్లలో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు మంచినీరు, పాల ప్యాకెట్లు లభ్యం కానీ వీధులలో మద్యం సరఫరా ఇస్తాను రాజ్యాంగ విక్రయిస్తున్నారు దీనిని దృష్టిలో ఉంచుకొని భీమదేవరపల్లి గ్రామ సర్పంచ్ కుమార్ స్వామి మొదటిగా స్పందించారు గ్రామంలో మద్యం అమ్మకాలు జరపొద్దని వారికి కొంత సమయం గడువు ఇచ్చి అనంతరం బెల్ట్ షాపులను నిర్వహించే వారిని గ్రామస్తుల సమక్షంలో నిలదీసి మద్యాన్ని స్వాధీనపరుచుకున్నారు అదే బాటలో కొత్తపల్లి గ్రామపంచాయతీ కూడా ఇలాంటి తీర్మానం చేసి బెల్ట్ షాపులను అడ్డుకునే విధంగా తమవంతు ప్రయత్నాలు చేస్తుంది ఇది ఇలా ఉండగా గ్రామాల్లో బెల్ట్ షాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు తనకి ఏమి తెలియనట్లు, చేతులు దులుపుకోవడంపై. ప్రజలలో సైతం విమర్శలు వెల్లి వెతుకుతున్నాయి ఇకనైనా బెల్ట్ షాపులను నియంత్రిస్తున్న గ్రామపంచాయతీలకు సహకరిస్తూ తమ విధులను సక్రమంగా పాటించాలని ప్రజలు ఎక్సైజ్ శాఖ అధికారులను కోరుతున్నారు

# వి కే సీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,**

వికే సీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి అని ప్రాజెక్ట్ ఆఫీసర్ మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీకే సీఎం పిట్ కమిటీ సభ్యులు కలిసి సమస్యలు పరిష్కరించాలి అని , మ్యాన్ పవర్, స్పేర్స్ టూల్స్, న్యూ మెషినరీ, సన్డేస్, రెయిన్ కోట్ , వాటర్ కాన్స్, క్యాంటీన్ సదుపాయాలు, ఆఫ్ లోడింగ్ సమస్యల పరిష్కరించాలని నేను డిమాండ్ చేశారు. అనంతరం ఆఫీసర్ సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు., ఈ కార్యక్రమంలో నాయకులు గోపు కుమార స్వామి, విప్లవ కుమార్, సకినాల సమ్మయ్యా, బిచ్చ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లకు శిక్షణ తరగతులు

- అందరూ సకాలంలో హాజరు కావాలి
- పాల్గొనున్న ఎంపీ
- డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న వెల్లడి

**కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,**

కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న ఆధ్వర్యంలో కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్ల ట్రైనింగ్ కార్యక్రమం నేడు పట్టణంలో గల కొత్తగూడెం క్లబ్ నందు నిర్వహించబడుతుందని ఆమె తెలుపుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి పాల్గొంటున్నారని ఆమె అంటూ , ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు అన్ని బూత్ లెవల్ ఏజెంట్లు, గ్రామ సర్పంచులు, మున్సిపల్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు సకాలంలో హాజరై ట్రైనింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్,డీసీసీ కమిటి సభ్యులు ప్రసాద్ బాబు,కొత్వాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సిటీటైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com

# నిలిచిన వాహనాలు..
# కదిలిన యంత్రాంగం



- **ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద వాటర్‌లాగింగ్‌తో రాకపోకలకు అంతరాయం**
- **ఖాజాగూడ చెరువులోకి వర్షపు నీరు వెళ్లే మార్గంలో అడ్డంకుల తొలగింపు**

**శేరిలింగంపల్లి, జూన్ 9 (సిటీటైమ్స్)**

హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షం సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ వ్యవస్థను దెబ్బతీసింది. గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో వాహనాల రద్దీ పెరగగా, ఎన్నికల సంఘం కార్యాలయం సమీపంలో భారీగా వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొంతసేపు వాహనాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పరిస్థితిపై సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఉప కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో కలిసి ఎన్నికల సంఘం కార్యాలయం పరిసర ప్రాంతాన్ని సందర్శించి నీటి నిల్వకు గల కారణాలను సమీక్షించారు.

పరిశీలనలో ఖాజాగూడ చెరువులోకి వర్షపు నీరు సజావుగా వెళ్లే మార్గంలో అడ్డంకి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యంత్రాంగాన్ని రంగంలోకి దించి హిటాచీ ఎక్స్‌కవేటర్ సహాయంతో అడ్డంకి తొలగింపు పనులు చేపట్టారు.

అనంతరం నీటి పారుదలను పునరుద్ధరించి నిల్వ నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో పరిస్థితి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జోన్ పరిధిలో వర్షపు నీటి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నీటినిల్వ సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



# జోజిలా టన్నెల్
# బ్రేక్‌థ్రూ విజయం



**శ్రీనగర్, సిటీ టైమ్స్**

కాశ్మీర్ లోయను లద్దాఖ్‌తో అనుసంధానించే వ్యూహాత్మక జోజిలా టన్నెల్ ప్రాజెక్టులో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. హిమాలయ పర్వత శ్రేణులను చీల్చుకుంటూ సాగుతున్న ఈ సొరంగ మార్గంలో చివరి 2.5 మీటర్ల భాగాన్ని విజయవంతంగా పేల్చివేయడంతో ప్రధాన సొరంగం రెండు అంచులు ఒకదానితో ఒకటి కలిసిపోయాయి. నిర్దేశిత గడువు కంటే 6 నెలల ముందే ఈ అద్భుత మైలురాయిని (బ్రేక్‌థ్రూ) అధిగమించడం విశేషం. ప్రపంచంలోనే అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్, ద్విదిశాత్మక (బైడైరెక్షనల్) బైపాస్ రహదారి సొరంగంగా ఇది రికార్డు సృష్టించబోతోంది.

లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతంలోని మీనామార్గ్‌లో ఉన్న ఈస్ట్ పోర్టల్ వద్ద కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రిమోట్ బటన్ నొక్కి ఈ తుది పేలుడును ప్రారంభించారు. ఈ చారిత్రక ఘట్టానికి జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సాక్ష్యంగా నిలిచారు.

"ఈ సొరంగం అత్యాధునికమైనది. అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలతో దీనిని నిర్మించాం. ఇది లేహ్, లద్దాఖ్ ప్రాంతాలకు అన్ని కాలాల్లోనూ (ఆల్‌వెదర్) రవాణా సౌకర్యాన్ని అందిస్తుంది" అని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. గతంలో లద్దాఖ్ ప్రజలు శీతాకాలంలో అనుభవించిన ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ, మోదీ ప్రభుత్వం మౌలిక వసతుల రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని ఆయన చెప్పారు.

**రూ. 5,000 కోట్ల ప్రజాధనం ఆదా**

"ఈ ప్రాజెక్టు అసలు టెండర్ విలువ రూ. 12,000 కోట్లు కాగా, పనులన్నింటినీ రూ. 7,000 కోట్లలోనే పూర్తి చేసి దాదాపు రూ. 5,000 కోట్ల ప్రజల సొమ్మును ఆదా చేశాం. ఇది కేవలం ఒక సొరంగం మాత్రమే కాదు, ఆ ప్రాంత ప్రజల జీవనరేఖ" అని గడ్కరీ హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ 'మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్' ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టింది. హిమాలయాల్లోని భౌగోళిక సవాళ్లను అధిగమిస్తూ, 'న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్' సాంకేతికతతో ఈ సొరంగాన్ని తవ్వారు.

**ప్రయాణ సమయం గంటన్నర నుంచి 15 నిమిషాలకు**

శ్రీనగర్‌లేహ్ జాతీయ రహదారిపై సముద్ర మట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో ఈ సొరంగాన్ని నిర్మించారు. కాశ్మీర్‌లోని సోన్‌మార్గ్ (బాల్తాల్) నుంచి లద్దాఖ్‌లోని మీనామార్గ్ (ద్రాస్) వరకు 18 కిలోమీటర్ల అప్రోచ్ రోడ్డుతో కలుపుకుని మొత్తం ప్రాజెక్టు పొడవు 31 కిలోమీటర్లు ఉంటుంది. ఇందులో ప్రధాన సొరంగం పొడవు 13.153 కిలోమీటర్లు.

ప్రస్తుతం ఈ దూరం ప్రయాణించడానికి గంటన్నర సమయం పడుతుండగా, టన్నెల్ అందుబాటులోకి వస్తే కేవలం 15 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. శీతాకాలంలో భారీ హిమపాతం కారణంగా జోజిలా పాస్ మూడు నెలల పాటు పూర్తిగా మూతపడుతుంది. ఈ టన్నెల్ పూర్తయితే ఏడాది పొడవునా పౌర, సైనిక రవాణా సాఫీగా సాగుతుంది. దేశ రక్షణ వ్యూహాల పరంగా కూడా ఇది అత్యంత కీలకమైనది.

**2028 ఫిబ్రవరి నాటికి పూర్తి అందుబాటులోకి..**

నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పర్యవేక్షణలో 2020 నుంచి 3,000 మందికి పైగా కార్మికులు రాత్రింబవళ్లు శ్రమించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఈ బ్రేక్‌థ్రూ సాధించారు. "మేం అత్యంత సవాలుతో కూడిన వాతావరణంలో రాత్రింబవళ్లు శ్రమించి, ఎలాంటి ప్రమాదం జరగకుండా ఈ టన్నెల్ పనిని పూర్తి చేశాం" అని ప్రాజెక్ట్ ఇంజనీర్ మన్మోహన్ సింగ్ తెలిపారు.

ప్రాజెక్ట్ అథారిటీ ఇంజనీర్ యూసఫ్ ఎస్‌హెగ్‌పూర్ రహిమాబాది (ఇరాన్ దేశస్థుడు) మాట్లాడుతూ, ఇప్పటివరకు 85 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులకు మరో రెండేళ్లు పడుతుందని, 2028 ఫిబ్రవరి నాటికి ఈ టన్నెల్‌ను ప్రజల కోసం పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని అధికారులు ప్రకటించారు. అయితే, ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే, సైనిక అవసరాల కోసం దీనిని ముందే ఉపయోగించుకునే వీలుంటుందని ఆయన తెలిపారు. సివిల్ పనులు మరో 78 నెలల్లో ముగుస్తాయని, ఆ తర్వాత ఎలక్ట్రికల్ పనులు ప్రారంభిస్తామని ప్రాజెక్ట్ బృందం పేర్కొంది.

ఈ టన్నెల్ 9.5 మీటర్ల వెడల్పు, 7.57 మీటర్ల ఎత్తుతో, గుర్రపు నాడా ఆకారంలో సింగిల్‌ట్యూబ్, టూలేన్ రహదారిగా రూపుదిద్దుకుంటోంది.




# శిలాఫలకాలతో కాదు.. పూర్తి చేసిన
# పనులతో మాట్లాడాలి



- **రూ.2 వేల కోట్ల పనులు స్వాగతమే.. గత అభివృద్ధిని విస్మరించొద్దు: మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా**
- **సభకు ప్రజలు రాకపోతే ప్రతిపక్షాలపై నెపం ఎందుకు.. రాజీనామా చేసి మళ్లీ గెలవాలి: బొబ్బ నవతారెడ్డి**

**శేరిలింగంపల్లి, జూన్ 9 (సిటీటైమ్స్)**

మియాపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం, అనంతరం చేసిన రాజకీయ వ్యాఖ్యలపై శేరిలింగంపల్లి రాజకీయాల్లో విమర్శలు -ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన కొత్త అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నప్పటికీ, గతంలో జరిగిన అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి కొత్త కథనం నిర్మించడం సరికాదని మాజీ కార్పొరేటర్, శేరిలింగంపల్లి సీనియర్ బీఆర్ఎస్ నేత కొమిరిశెట్టి సాయిబాబా, బీఆర్ఎస్ నాయకురాలు బొబ్బ నవతారెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి అంటే శంకుస్థాపనలతో కాదు.. పూర్తయిన పనులతో ప్రజలకు కనిపించాలని, రాజకీయ ఆరోపణల కంటే పనుల అమలుపైనే దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రకటించిన సుమారు రూ.2 వేల కోట్ల అభివృద్ధి పనులకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

శేరిలింగంపల్లికి కొత్త పనులు రావడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే ఇప్పటివరకు అభివృద్ధి జరగలేదన్న భావన కలిగించే వ్యాఖ్యలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేవన్నారు. 2014కు ముందు శేరిలింగంపల్లి ఎలా ఉండేదో, ఆ తర్వాత ఏ స్థాయిలో మార్పు వచ్చిందో ప్రజలకు తెలుసన్నారు. 2018, 2023 ఎన్నికల్లో కూడా అభివృద్ధి అంశంపైనే ప్రజలు తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. అభివృద్ధి జరిగిందా లేదా అన్నది రాజకీయ వేదికలపై కాదు.. ప్రజల మధ్యే తేలుతుందని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధికి తాము సహకరిస్తామని, అయితే ప్రకటించిన పనులు కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా పూర్తై ప్రజలకు ఉపయోగపడాలని సూచించారు. గతంలో ఏర్పాటైన శిలాఫలకాల మాదిరిగా ఇవి కూడా గుర్తులుగానే మిగలకూడదని, పూర్తి చేసిన పనులే ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు.

బొబ్బ నవతారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సభకు ప్రజల స్పందన ఆశించిన స్థాయిలో లేకపోవడాన్ని ప్రతిపక్షాలపై మళ్లించడం సరికాదన్నారు. గడియారాల పంపిణీ, ప్రచార కార్యక్రమాలను కారణాలుగా చూపడం రాజకీయంగా బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రజలు సభలకు రావడం, రాకపోవడం వారి నిర్ణయమని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ రాజకీయ ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ.. అధికారంలో ఉన్న పార్టీకి అనుగుణంగా రాజకీయ వైఖరి మార్చుకోవడం ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. గతంలో ప్రకటించిన 700 పడకల ఆసుపత్రి, బస్ టెర్మినల్, మియాపూర్-బీహెచ్ఈఎల్ మార్గం, చెరువుల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల పనులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పేరుతో అంకెల రాజకీయాల కంటే ప్రకటించిన పనులు

పూర్తై ప్రజలకు కనిపించడమే ముఖ్యమని పేర్కొంటూ, అవసరమైతే ప్రజల తీర్పు కోరుతూ రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో నిలవాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.



# తాళం పగలలేదు..
# లాకర్ ఖాళీ అయింది



- **హిల్‌రిడ్జ్ విల్లాలో భారీ చోరీ కేసు ఛేదించిన పోలీసులు**
- **ఉత్తరప్రదేశ్‌లో ముగ్గురు అరెస్ట్.. చోరీ సొత్తు స్వాధీనం**

**సైబరాబాద్, జూన్ 9 (సిటీటైమ్స్)**

ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబానికి తొలుత కనిపించింది పూజా గదిలో విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడమే. ఇంటి తాళాలు యథావిధిగా ఉండటం, లాకర్ కూడా చెక్కుచెదరకుండా కనిపించడంతో మొదట పెద్దగా అనుమానం రాలేదు. కానీ తర్వాత లాకర్ తెరిచి చూడగా భారీ మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో హిల్‌రిడ్జ్ విల్లాలో జరిగిన భారీ చోరీ వెలుగులోకి వచ్చింది. ఇంట్లో పనిచేస్తున్న వారిపైనే అనుమానం మళ్లిన ఈ కేసులో సైబరాబాద్ పోలీసులు మూడు రోజుల్లోనే కేసును ఛేదించి ఉత్తరప్రదేశ్‌లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

నగరంలో గతంలో కూడా గృహ సహాయకుల నేపథ్యంతో నమోదైన కొన్ని చోరీ కేసుల తర్వాత పోలీసు ధ్రువీకరణపై పదేపదే హెచ్చరికలు జారీ అవుతున్న వేళ ఈ ఘటన మరోసారి అప్రమత్తత అవసరాన్ని గుర్తుచేసింది.

పోలీసుల వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని హిల్‌రిడ్జ్ విల్లాలో నివసించే ఓ వ్యాపారవేత్త కుటుంబం ఇటీవల నగరానికి బయటకు వెళ్లింది. ఈ సమయంలో ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన దంపతులు పరిస్థితిని గమనించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానించి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ సభ్యులు తిరిగి వచ్చిన తర్వాత తొలుత పూజా గదిలోని విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారు. అనంతరం ఇంట్లోని లాకర్ తెరిచి చూడగా పెద్ద మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో కేసు తీవ్రత పెరిగింది. విచారణలో లాకర్ పక్కనే ఉంచిన తాళంతో నగలు తీసి, అనంతరం మళ్లీ లాకర్‌కు తాళం వేసి అసలు తాళాన్ని వెంట తీసుకెళ్లినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

సమాచారం అందుకున్న వెంటనే సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఎస్‌వోటీ, క్రైమ్ బృందాలు, స్థానిక పోలీసులు కలిసి సీసీటీవీ దృశ్యాలు, ప్రయాణ వివరాలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. ఉత్తరప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఆరు ప్రత్యేక బృందాలను పంపించారు. ఇదే సమయంలో ఇలాంటి అంతర్రాష్ట్ర నేర ముఠాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం కూడా దర్యాప్తులో భాగమైంది. దర్యాప్తులో భాగంగా గచ్చిబౌలి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ నేతృత్వంలోని బృందం ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లా ఉదంపూర్ ప్రాంతంలో కమల్ షాహి, అతని భార్య విమల్ షాహి, మరో మహిళ కల్పనను అదుపులోకి తీసుకుంది. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించనున్నారు. ఇంటి పనివారిని నియమించుకునే ముందు వారి వివరాలను స్థానిక పోలీసుల ద్వారా ధ్రువీకరించుకోవాలని, తాళాలు, విలువైన వస్తువులు అందుబాటులో ఉంచకూడదని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.






# షుగర్ తగ్గడానికి ఓ అర చెంచా దాల్చిన చెక్క పొడి ఉంటే చాలు, ఎలా తీసుకోవాలో తెలుసా?

డయాబెటిస్ ముప్పు రోజు రోజుకి పెరుగుతుంది. షుగర్ బాధితుల సంఖ్య పెరుగుతుంది. ఓ మాటలో చెప్పాలంటే మన దేశం డయాబెటిస్ రాజధానిగా మారుతుంది. షుగర్ ఒక్కసారి వచ్చిదంటే దాన్ని కంట్రోల్ చేయడం చాలా కష్టం. దీనికి శాశ్వాత చికిత్స లేదు. కేవలం మందులు, జీవనశైలిలో మార్పుల ద్వారా మాత్రమే రక్తంలోని షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచవచ్చు.



ఇక, షుగర్ వ్యాధి ఉన్న వారు తినే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏది పడితే అది తింటే రక్తంలో షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. ఇక, మన వంటగదిలో దొరికే దాల్చిన చెక్కతో షుగర్ లెవల్స్ కంట్రోల్ చేయవచ్చని ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ దీక్షా భవాసార్, నీల్ సవాలియా చెబుతున్నారు. డాక్టర్ ప్రకారం దాల్చిన చెక్క పొడిని ఎలా తీసుకుంటే షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**డాక్టర్ ఏమంటున్నారు?**

ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసుకున్నారు డాక్టర్ దీక్ష భవాసార్. డయాబెటిస్ కేవలం చక్కెర వ్యాధి కాదని బలహీనమైన జీర్ణక్రియ, జీవక్రియ ఫలితంగా వస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. దాల్చిన చెక్క వేడి, కార్మినేటివ్ మూలికలు శరీర అంతర్గత వ్యవస్థల్ని సమతుల్యం చేయడంలో సాయపడతాయి. అయితే, డాక్టర్ ప్రకారం దాల్చిన చెక్కలు రెండు రాకాలు. ఒకటి సిలోన్, మరొకటి కాసియా దాల్చిన చెక్క రకం. అయితే,



సిలోన్ దాల్చిన చెక్క బెస్ట్ అంటున్నారు డాక్టర్. ఇది రోజువారి వినియోగానికి అనువైనంది. తక్కువ మొత్తంలో దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల డయాబెటిస్ నిర్వహణకు సహజ మద్ధతు లభిస్తుంది.


**దాల్చిన చెక్కతో షుగర్ రోగులకు ప్రయోజనాలు**

రక్తంలో చక్కెరను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. దాల్చిన చెక్క ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. శరీరం చక్కెరను మరింత సమర్ధవంతంగా ఉపయోగించుకునేలా చేస్తుంది.

దాల్చిన చెక్క జీవక్రియను బలపరుస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, దాల్చిన చెక్కలో దీపన-పచన్ లక్షణాలు ఉన్నాయి. ఇది బలహీనమైన అగ్నిని సక్రియం చేస్తుంది.

మధుమేహంలో కఫ, అమ (టాక్సిన్స్) పెరుగుదల సర్వసాధారణం. దాల్చిన చెక్క వీటిని సమతుల్యం చేయడంలో సాయపడుతుంది.

క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనవసరమైన కొవ్వు పేరుకుపోవడం తగ్గుతుంది. ఇది డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుందని డాక్టర్ చెబుతున్నారు.




**దాల్చిన చెక్కను ఎలా తీసుకోవాలి?**

దాల్చిన చెక్కను పొడి రూపంలో తీసుకోవచ్చు. దాల్చిన చెక్క పొడిని వంటల్లో, కూరల్లో ఉపయోగించవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు ఉదయాన్నే ఖాళీ కడుపుతో గోరువెచ్చన దాల్చిన చెక్క టీ తీసుకోవచ్చు. ఇందుకోసం దాల్చిన చెక్క పొడిని ఒక గ్లాస్ నీటిలో మరగించాలి. గోరువెచ్చగా మారిన తర్వాత తాగాలి. మీరు రుచి కోసం కావాలనుకుంటే నిమ్మరసం కలుపుకోవచ్చు. ఇక, ఫ్రూట్, వెజిటేబుల్ సలాడ్లలో చిటికెడు దాల్చిన చెక్కను పొడిని చల్లి వాటిని తినవచ్చు. కావాలంటే గోరువెచ్చని నీరు లేదా హెర్బల్ డ్రింక్ కలిపి తాగవచ్చు.

**తెలుసుకోవాల్సిన విషయాలు**

సిలోన్ రకం దాల్చిన చెక్కలో కూమారిన్ తక్కువగా ఉంటుంది. అందుకే దీనిని రోజువారి వినియోగానికి మంచిదని డాక్టర్ దీక్ష అంటున్నారు. అయితే కాసియా దాల్చిన చెక్క పెద్ద పరిమాణంలో తీసుకుంటే హానికరం కావచ్చు. సిలోన్ దాల్చిన చెక్క రక్తంలో షుగర్ లెవల్స్‌ను సమతుల్యం చేయడానికి సాయపడుతుంది. ఇది జీర్ణక్రియను బలోపేతం చేసే ప్రభావవంతమైన ఆయుర్వేద ఔషధం. రోజుకు ఓ అరచెంచా దాల్చిన చెక్క పొడి తీసుకుంటే చాలు. ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదం ఉంది.

దాల్చిన చెక్క తీసుకోవడం వల్ల డయాబెటిస్ రోగులకు మాత్రమే కాదు.. ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

దాల్చిన చెక్క తీసుకోవడం అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడుతుంది. రోజూ దాల్చిన చెక్క టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్‌ను నియంత్రించవచ్చు.

దాల్చిన చెక్క పొడి తీసుకోవడం వల్ల కడుపులో గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్క పాలు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.

వాతావరణంలో మార్పుతో జలుబు, ఫ్లూ సమస్యలు వస్తున్నాయి. దాల్చిన చెక్క పొడిని తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తీసుకుంటే జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది.

# పొట్ట +తొడ +నడుము చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించే ఒకే ఒక వ్యాయామం



ఈ రోజుల్లో చాలా మంది అధిక కొవ్వు సమస్యతో బాధపడుతున్నారు. అది బెల్లీ ఫ్యాట్, తొడల దగ్గర పెరిగిన కొవ్వు, హిప్ ఫ్యాట్ ఏదైనా కావచ్చు. వివిధ భాగాల్లో కొవ్వు ఎక్కువ పేరుకుపోవడం ఆరోగ్యాన్ని నాశనం చేయడమే కాకుండా.. శరీర ఆకృతిని కూడా పాడు చేస్తుంది. ఎబ్బెట్టుగా కనిపించేలా చేస్తుంది. అందుకే పెరిగిన కొవ్వును తగ్గించుకోవాలి. ఇది ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా.. మిమ్మల్ని ఫిట్‌గా మారుస్తుంది.



ఇక, కొవ్వు తగ్గడానికి చాలా మంది అనేక ప్రయత్నాలు చేస్తారు. కొందరు తిండిలో మార్పులు చేసుకుంటారు. మరికొందరు జిమ్‌లో గంటల తరబడి కష్టపడుతుంటారు. అయితే, ఒక్కసారి కొవ్వు పేరుకుపోతే కరిగించడం చాలా కష్టంగా ఉంటుంది.

ప్రసవం తర్వాత చాలా మంది మహిళలు బరువు పెరుగుతారు. ఇక, ఆఫీసుల్లో పనిచేసే మగవారికి కూడా కడుపు, తుంటి, తొడల దగ్గర కొవ్వు పెరుగుతుంది. జిమ్‌కి వెళ్లడానికి సమయం దొరకదు. అలాంటి వారి కోసం ఒకే ఒక వ్యాయామాన్ని షేర్ చేసుకున్నారు ఫిట్‌నెస్ కోచ్ రితికా కె బలూజా. ఈ వ్యాయామాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసుకున్నారు. 15 రోజుల పాటు ఈ వ్యాయామం చేస్తే కడుపు, తుంటి, చేతులు, తొడలపై కొవ్వు మాయమవుతుంది. ఇంతకీ ఆ వ్యాయామం ఏంటి, ఎలా చేయాలన్న పూర్తి వివరాలపై తెలుసుకుందాం.

**ఇంతకీ ఆ వ్యాయామం ఏంటి?**

ఫిట్నెస్ కోచ్ రితిక ఇన్‌స్టాగ్రామ్‌లో హై నీ లిఫ్ట్ వ్యాయామం చేస్తున్న వీడియోను షేర్ చేసింది. అంటే మోకాలితో చేసే వ్యాయామం. ఈ వ్యాయామం 15 రోజుల్లో బెల్లీ, చేయి, తొడ, తుంటి కొవ్వును తగ్గించడంలో సాయపడుతుందని రితిక తెలిపారు ఈ వ్యాయామం చేయడం కూడా చాలా సులభం. ఆమె ప్రకారం ఈ వ్యాయామాన్ని 15 రోజుల పాటు చేయాలి. అంతేకాకుండా రోజుకు 100 సార్లు చేయాలి.

**వ్యాయామం ఎలా చేయాలి?**

ఈ వ్యాయామం చేయడానికి ముందుగా మీరు నిటారుగా నిలపబడాలి. ఆ తర్వాత కుడివైపు మోకాలి.. పైకి ఎత్తి.. రెండు చేతుల్ని నేరుగా నడుము వరకు తీసుకురావాలి. ఇలా ఒక కాలుతో 50 సార్లు చేయాలి. ఆ తర్వాత మరొక కాలుతో 50 సార్లు రిపీట్ చేయాలి. మొదటి 50 సార్లు చేసి కావాలంటే కాసేపు రెస్ట్ తీసుకోవచ్చు. ఈ వ్యాయామాన్ని ఉదయం లేదా సాయంత్రం చేయవచ్చు. అయితే, మంచి ఫలితాలు ఉండాలంటే దీన్ని 15 రోజులు క్రమం తప్పకుండా చేయాలని ఎక్స్‌పర్ట్ అంటున్నారు.

**ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి?**

ఈ వ్యాయామం రెగ్యులర్‌గా చేయడం వల్ల కొవ్వు కరగడంతో పాటు శరీర నొప్పులు కూడా మాయమవుతాయి.

వెన్ను నొప్పితో బాధపడేవారికి ఇది బెస్ట్ వ్యాయామం. ముఖ్యంగా మహిళలు, ఆఫీసుల్లో పనిచేసే వారు ఈ వ్యాయామం చేయడం మంచిది.

మోకాలు హైగా లిఫ్ట్ చేయడం వల్ల శరీరంలోని కండరాలు, ఎముకలు స్ట్రాంగ్ అవుతాయి.

కాళ్లను బలపేతం చేయడానికి కూడా ఈ వ్యాయామం ప్రయోజనకరంగా ఉంటుంది.

గంటల తరబడి కూర్చొని పనిచేసేవారికి ఈ వ్యాయామం చాలా మంచిది. ఇది మీ భంగిమను మెరుగుపర్చడంలో సాయపడుతుంది.

**గుర్తించుకోవాల్సిన విషయాలు**

మీరు ఏదైనా సమస్యతో బాధపడుతుంటే ఈ వ్యాయామం చేసే ముందు వైద్యులు లేదా నిపుణుడ్ని సంప్రదించండి.

ఈ వ్యాయామంతో పాటు సరైన జీవనశైలి పాటించడం కూడా చాలా ముఖ్యమని గుర్తించుకోండి. జంక్ ఫుడ్, వేయించిన ఆహారాలు, షుగరీ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. సమతుల్య ఆహారాన్ని తినండి. తాజా పండ్లు, కూరగాయలు, గింజలు, విత్తనాలు, తృణధాన్యాలు వంటి వాటిని భాగం చేసుకోండి.

ఈ వ్యాయామంతో పాటు రోజు వాకింగ్ చేయండి. వాకింగ్ వల్ల ఫ్యాట్ తగ్గడమే కాకుండా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**యోగా కూడా సాయపడుతుంది**

బెల్లీ ఫ్యాట్, తొడల దగ్గర కొవ్వు తగ్గించేందుకు కొన్ని ఆసనాలు కూడా మీకు సాయపడతాయి. ఉత్కటాసనం, వజ్రాసనం, త్రికోణాసనం, దేవియసనం, బద్ధకోణాసనం వంటి యోగాసనాలు మీకు సాయం చేస్తాయి. ఈ ఆసనాలు రెగ్యులర్‌గా వేయడం వల్ల బెల్లీ ఫ్యాట్‌తో పాటు తొడల దగ్గర కొవ్వు తగ్గుతుంది. ఇక, బరువు పెరగడంలో ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి తగ్గించుకోవడానికి ప్రాణాయామం, ధ్యానం వంటి వాటిని భాగం చేసుకోండి.




# రష్మికకేనా ఆ అవకాశం?

ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథని తెరపైకి తీసుకురాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. దీనికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించనున్నారట. ఈ బయోపిక్‌లో నటించడానికి మొదట సాయిపల్లవి, రుక్మిణీ వసంత్ లాంటి పలువురు తారల పేర్లు వినిపించాయి. తాజాగా ఈ కథ రష్మిక వద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆమెతో కథా చర్చలు పూర్తయినట్టు సమాచారం. ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్ర కోసం ఆమె.. ఇప్పటికే లుక్ టెస్ట్ కూడా చేయించుకున్నారంటూ వార్తలు వస్తున్నాయి. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం రష్మిక ఖాతాలో 'మైసా', 'రణబాలి', 'కాక్‌టెయిల్ 2' తదితర చిత్రాలున్నాయి.





# నేను చనిపోయానని ఫొటోలు వేశారు: జగపతి బాబు



సినిమాలో కాకుండా బయట కూడా నటిస్తూ బతకాల్సిన అవసరం తనకు లేదన్నారు నటుడు జగపతి బాబు . అందుకే ఏదైనా ఉన్నది ఉన్నట్లు నిర్మొహమాటంగా మాట్లాడటం నేర్చుకున్నట్లు తెలిపారు. ఇటీవల 'పెద్ది'లో అప్పలసూరి పాత్రతో మెప్పించిన ఆయన.. ఈ సినిమా విడుదల అనంతరం వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.


"ఒకప్పుడు ఫ్యామిలీ ఆడియన్స్ వల్లే నాకు ఇంత గుర్తింపు వచ్చింది. ఇప్పుడు నన్ను అందరూ ఆదరిస్తున్నారు. ఎందుకంటే నేను అందరు హీరోలతో కలిసి నటిస్తున్నాను. నా కెరీర్, జీవితంలో ఏ విషయంలోనూ పశ్చాత్తాపం లేదు. కోల్పోయిన దాని గురించి ఎప్పుడూ ఆలోచించను. జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటన ఏదోఒక పాఠాన్ని నేర్పుతుంది. అబద్ధాలు ఎవరైనా చెబుతారు. 'నేను జీవితంలో అబద్ధం చెప్పలేదు' అని మనకు ఎవరైనా చెప్పారంటే అదే పెద్ద అబద్ధం. నిజం చెప్పి కూడా బతకొచ్చని అర్థమైంది. అప్పటినుంచే నిర్మొహమాటంగా మాట్లాడుతున్నా. అనవసరంగా నిజం దాచడం, ప్రతిదానికి అబద్ధం ఆడుతూ బతకాల్సిన అవసరం ఏముంది. నిజజీవితంలోనూ నటించాల్సిన అవసరం లేదు కదా" అని అన్నారు.

"నన్ను ట్రోల్ చేయడానికి నెటిజన్‌లకు చాలా అవకాశాలే వచ్చాయి. కానీ, మిగతావారితో పోలిస్తే నన్ను చాలా తక్కువ ట్రోల్ చేశారు. గతంలో ఒకసారి నేను చనిపోయానని.. ఎన్టీఆర్ ఏడుస్తోన్న ఫొటోను పక్కన పెట్టి వ్యూస్ కోసం వీడియోలు చేశారు. ఆ తర్వాత అది కూడా మానేశారు. అలాంటి వాటి గురించి నేను అసలు పట్టించుకోను. పనిలేని వాళ్లు చేసే పనులు అవి. అలాంటి వాటికి స్పందించను. నా జీవితాన్ని నాకు నచ్చినట్లు బతుకుతూ ఆస్వాదిస్తున్నాను" అని జగపతిబాబు చెప్పారు.

# ఇలాంటి వాటిని వెంటనే ఖండించాలి: 'పెద్ది' జాన్వీ వివాదంపై జయా బచ్చన్ కామెంట్స్



'పెద్ది' సినిమా విడుదలైన తర్వాత అందులో హీరోయిన్ పాత్ర ఇండస్ట్రీలో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ వివాదంపై సీనియర్ నటి జయా బచ్చన్ స్పందించారు. సినిమాల్లో మహిళలను గ్లామర్ పాత్రల వరకే చూడడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. సెట్‌లోనే ఇలాంటివాటిని వెంటనే అడ్డుకోవాలని, అంతా జరిగిన తర్వాత మాట్లాడటం వల్ల ఉపయోగం ఉండదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జయా బచ్చన్ తన కెరీర్‌లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. గతంలో 'షోర్' సినిమా షూటింగ్‌లో దర్శకుడు ఆమెను ఒక సీన్ కోసం గాగ్రా చోళీ లాంటి ప్రత్యేకమైన డ్రెస్ వేసుకోవాలని కోరారట. కానీ, ఆమె దాన్ని ధరించాలంటే కచ్చితంగా చున్నీ ఉండాలని పట్టుబట్టారట. ఈ విషయంలో ఇద్దరికీ పెద్ద గొడవ జరిగిందని జయ తెలిపారు. "ఆ తర్వాత సెట్‌లో ఎవరూ నాతో గీత దాటే ధైర్యం చేయలేదు. నా కెరీర్‌లో నన్ను అలా చూపించడానికి ప్రయత్నించిన చేదు అనుభవం అదొక్కటే. తర్వాత నేను ఆ దర్శకుడితో మళ్లీ ఎప్పుడూ పని చేయలేదు" అని జయ స్పష్టం చేశారు. ఇలాంటి విషయాలపై సెట్‌లోనే వెంటనే తిరగబడాలని ఆమె ఇతర నటీమణులకు సూచించారు. ఈ కామెంట్స్‌కు కరీనాకపూర్ మద్దతు ఇచ్చారు. తెరపై రొమాన్స్ కోసం, ప్రేక్షకులను ఆకట్టుకోవడం కోసం అలాంటి దుస్తులు ధరించాల్సిన అవసరం లేదని కరీనా అభిప్రాయపడ్డారు. కాజోల్, శ్రీదేవి, షర్మిలా ఠాగూర్ వంటి గొప్ప నటీమణులు ఒంటినిండా దుస్తులు ధరించి కూడా అద్భుతమైన హావభావాలతో ప్రేక్షకులను మెప్పించారని కరీనా గుర్తుచేశారు. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఇందులో జాన్వీ కపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించారు. ఆమె పాత్రను కేవలం గ్లామర్ వరకే పరిమితం చేశారని.. ఆమెను తెరపై చూపిన విధానంపై సెలబ్రిటీలు కూడా అసహనం వ్యక్తంచేశారు. దీంతో దర్శకుడు క్షమాపణలు చెప్పారు.



# అందుకే నిర్మాతగా మారాను

కథానాయకుడు నాగచైతన్య 'దూత' సిరీస్‌తో ఓటీటీ రంగప్రవేశం చేసి హిట్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ విడుదలై ఘన విజయం సాధించింది. మూడేళ్ల తర్వాత దీనికి కొనసాగింపుగా ఇప్పుడు 'దూత 2' పట్టాలెక్కింది. నాగ చైతన్య ఈసారి నిర్మాణ బాధ్యతల్ని కూడా నిర్వర్తించనున్నారు. తాజాగా ఈ సిరీస్ గురించి ఆయన మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్ అంటే తనకు ఎంతో ఇష్టమని.. నటనకు మించి ఏదైనా చేయాలని అనిపించిందని చైతన్య చెప్పారు. అందుకే నిర్మాతగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఏదైనా పనిలో పూర్తిగా లీనమైనప్పుడు, దాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తామని ఆ అభిరుచే తనను 'దూత 2' సిరీస్‌కు నిర్మాతగా కూడా తనవంతు సహకారం అందించేలా ప్రోత్సహించిందన్నారు. దర్శకుడు విక్రమ్ కుమార్, నిర్మాత శరత్ మారర్‌లతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు.

'దూత 2'లో భూమిక..

ఇటీవల ఈ వెబ్‌సిరీస్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సిరీస్‌లో నటి భూమిక కీలక పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో నాగచైతన్య నటించిన 'సవ్యసాచి'లో భూమిక కనిపించారు. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే ఇది వీరి రెండో ప్రాజెక్ట్ అవుతుంది. దీనిపై అధికారిక సమాచారం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# ఓటీటీలోకి 'కరుప్పు'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కరుప్పు'. తెలుగులో 'వీరభద్రుడు'గా విడుదలైంది. ఆర్జే బాలాజీ తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జూన్ 12 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా ఓటీటీపై కొన్ని రోజులుగా వార్తలు వచ్చినప్పటికీ తాజాగా అమెజాన్ అధికారికంగా ప్రకటిస్తూ యాప్‌లో అప్‌డేట్ చేసింది. ఈ సినిమా కోలీవుడ్‌లో విజయాన్ని సాధించిన సూర్య కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో చోటు సొంతం చేసుకుంది.



Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N.Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**